thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal


| సంపుటి : 21 | సంచిక : 90 | జగిత్యాల | శనివారం | 27 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

క్రికెట్ దిగ్గజాలకు గౌరవ హోదాలు



11

## సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు



- ఎన్నికల సంఘం కీలక ప్రకటన

4

## అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!



ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

4

## ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



4



# మత్తుపై ఉక్కుపాదం

- డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం
- ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- పోలీసులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఈగల్ స్క్వాడ్‌కు పూర్తి అండ
- సమాజంలో మార్పుతోనే నిర్మూలన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా పారదోలి, 'డ్రగ్స్ రహిత తెలంగాణ'ను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. మత్తు పదార్థాల దందాలో ఎంతటి పెద్దవారున్నా, వారికి రాజకీయ పలుకుబడి ఉన్నా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన కఠినంగా హెచ్చరించారు. ప్రాణాలకు తెగించి ఈ మత్తు జాలాన్ని ఛేదిస్తున్న పోలీసులకు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ స్క్వాడ్ విభాగానికి పూర్తి అండదండలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. అయితే కేవలం కఠిన చట్టాలతోనే దీనిని నిర్మూలించలేమని, సమాజంలో, ముఖ్యంగా యువత ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే పూర్తి ఫలితాలు సాధించగలమని ఆయన పిలుపునిచ్చారు.

వివరాలు 2లో..



## మత్తుపై పోరుకు ఏకమవుదాం!

- డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి లక్ష్యం
- మత్తు మహమ్మారితో కుటుంబాలు నాశనం
- చట్టాలు, పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదు
- సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ కదలాలి
- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

'డ్రగ్స్ రహిత తెలంగాణ' సాధనకు రాష్ట్ర ప్రజలంతా ఏకమై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మత్తు మహమ్మారిని నిర్మూలించడం కేవలం పోలీసులతోనే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి సహకరించాలని ఆయన ఆకాంక్షించారు.

2

## రాష్ట్ర కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

- జూన్ 30న సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ
- అదే రోజు కొత్త సీఎస్‌గా బాధ్యతల స్వీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జాజు ట్రాక్ రికార్డుకే సీఎం రేవంత్ మొగ్గు
- 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి రాక

3



## సీఎం సలహాదారుగా రామకృష్ణారావు

సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్

సీఎంవో నుంచి అజిత్ రెడ్డి ఔట్

జీపడీకి అహ్మద్ నదీమ్ నియామకం



3

## తెలుగు రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్!

ఏపీ, తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు

పిడుగులతో కూడిన వానలు పడే అవకాశం

అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



తెలుగు రాష్ట్రాల్లో రానున్న 3 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈదురుగాలులు, పిడుగులు పడే ముప్పు ఉన్నందున ఏపీ, తెలంగాణ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది.

3



## పాటిల్‌తో ఏమన్నారో చెప్పాలి!

- కేంద్ర మంత్రితో భేటీపై సీఎం స్పష్టతనివ్వాలి
- తుంగభద్ర జలాల వాటాలో తీవ్ర అన్యాయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2

## కేసీఆర్‌ది రైతుబంధు.. కాంగ్రెస్‌ది రాబందు!

- అసైన్డ్ భూములు లాక్కుంటే ఊరుకోం
- లగచర్ల అరాచకాలను ఎప్పటికీ మర్చిపోం
- రేవంత్ సర్కారుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

..వివరాలు 2లో



## ఆటోలోనే పురుడు!

భద్రాద్రి జిల్లాలో దారుణం అర్ధరాత్రి అంబులెన్స్ రాక..

తాళం వేసి ఉన్న ఆస్పత్రులు నరకయాతన అనుభవించిన గర్భిణీ

వివరాలు 2లో..

## మరో ముల్కీ ఉద్యమం తప్పదు!

తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత సర్కారుదే

స్థానికత నిబంధనలతో యువతకు తీవ్ర అన్యాయం

కోర్టులో వాదనలు వినిపించడంలో టీఎస్పీఎస్సీ విఫలం

ఉద్యోగులను దారుణంగా మోసం చేసిన సీఎం రేవంత్

బీఆర్ఎస్ నేత, మాజీ ఉద్యోగ సంఘాల నేత దేవీప్రసాద్

వివరాలు 2లో..

చురకలు



# పాటిల్‌తో ఏమన్నారో చెప్పాలి!

**కేంద్ర మంత్రితో భేటీపై సీఎం స్పష్టతనివ్వాలి**

**తుంగభద్ర జలాల వాటాలో తీవ్ర అన్యాయం**

**15.9 టీఎంసీలకు గాను వస్తోంది 5 టీఎంసీలే**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల భారీ మోసం**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్ :** కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం మాట్లాడారో రాష్ట్ర ప్రజలకు వెంటనే వెల్లడించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్ చేశారు. తుంగభద్ర జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రామచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు బయటపెట్టాలని ఆయన పట్టుబట్టారు. ఆ రెండు ప్రాజెక్టుల నుంచి రాష్ట్రానికి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా.. కేవలం 5 టీఎంసీలు మాత్రమే వస్తున్నట్లు చూపుతున్నారని ఆయన ఆరోపించారు.

### వాటా కోతకు కేసీఆరే కారణం..

నీటి వాటాల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాయని ఆయన విమర్శించారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ అంగీకరించి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా ప్రస్తుత ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై ఎంఐఎం నేత ఓవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఐడీ కార్డు అనేది కేవలం ఓటు వేసేందుకు మాత్రమే పరిమితం కాదని ఆయన స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ లాంటి ఇతర గుర్తింపు పత్రాల చెల్లుబాటుకు కూడా ఇది అత్యంత కీలకమని గుర్తుచేశారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఓవైసీ మాట్లాడటం తగదని ఆయన హితవు పలికారు.

# చెరువులకు హైడ్రా జీవం!

**107 కోట్లతో మరో 4 చెరువుల అభివృద్ధి**

**పనులను ప్రారంభించిన కమిషనర్ రంగనాథ్**

**311 ఎకరాల విస్తీర్ణంలో సుందరీకరణ**

**వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు**

**పర్యాటక శాఖ ఆధ్వర్యంలో త్వరలో బోటింగ్**

**హైదరాబాద్ :** నగరంలో వరదలను అరికట్టడం, భూగర్భ జలాలను పెంచడమే



లక్ష్యంగా 'హైడ్రా' మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏకంగా 107 కోట్ల వ్యయంతో నగర పరిధిలోని మరో 4 ప్రముఖ చెరువుల పునరుద్ధరణ పనులను భారీస్థాయిలో చేపట్టింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు.

### పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేలా..

హైడ్రా చేపట్టిన ఈ అభివృద్ధి జాబితాలో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ 4 చెరువులను సర్వాంగ సుందరంగా మార్చేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఈ సుందరీకరణలో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఆయా పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# ఆటోలోనే పురుడు!

**భద్రాద్రి జిల్లాలో దారుణం అర్ధరాత్రి అంబులెన్స్ రాక..**

**తాళం వేసి ఉన్న ఆస్పత్రులు నరకయాతన అనుభవించిన గర్భిణీ**

**భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీలో వైద్య వ్యవస్థ డొల్లత బయటపడింది. అర్ధరాత్రి వేళ అంబులెన్స్ రాక, ఆస్పత్రులు మూతపడటంతో ఓ గర్భిణీ ఆటోలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. పినపాక మండలం అమరం గ్రామానికి చెందిన కలివేటి సంధ్య అనే గర్భిణీకి అర్ధరాత్రి అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చాయి. అత్యవసర సహాయం కోసం కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అది అందుబాటులో లేదు. గిరిజనుల కోసం కేటాయించిన ఆ వాహనాన్ని వేరే ప్రాంతానికి తరలించడమే దీనికి కారణం.

### ఆస్పత్రికి తాళం..

విధిలేని పరిస్థితుల్లో వారు ఒక ఆటో మాట్లాడుకుని సంధ్యను జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తీసుకెళ్లారు. తీరా అక్కడికి వెళ్లేసరికి ఆస్పత్రికి తాళం వేసి ఉండటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. చేసేదేమీ లేక అక్కడి నుంచి పినపాక పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ఆటోలో బిడ్డకు జన్మనిచ్చింది.

### క్షేమంగా తల్లి, బిడ్డ..

తొలి కానుపు కావడంతో ఆమె పురిటి నొప్పులతో తీవ్రంగా అల్లాడిపోయింది. విపరీతమైన రక్తస్రావం కావడంతో నరకయాతన అనుభవించింది. ప్రస్తుతం మణుగూరులోని 100 పడకల ఆస్పత్రిలో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏజెన్సీలో రాత్రి వేళల్లో ఆస్పత్రులు మూసి ఉంచడం, అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి 108 సదుపాయంతో పాటు, రాత్రి పూట వైద్య సేవలు అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేసీఆర్‌ది రైతుబంధు.. కాంగ్రెస్‌ది రాబందు!

- అసైన్డ్ భూములు లాక్కుంటే ఊరుకోం
- లగచర్ల అరాచకాలను ఎప్పటికీ మర్చిపోం
- రేవంత్ సర్కారుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- దళిత, గిరిజనులకు ఇచ్చిన హామీలు ఏవీ?
- ఎన్నికల కోసమే రైతుబంధు ఇస్తున్నారు

**పరిగి :** పేదల అసైన్డ్ భూములను గుంజుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కేసీఆర్ సర్కారు రైతులను ఆదుకుంటే.. కాంగ్రెస్ సర్కారు రాబందులా పేదల భూములను పీక్కుతింటోందని ఆయన విమర్శించారు. పరిగి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడల పేరుతో దళిత, గిరిజనుల అసైన్డ్ భూములను కాంగ్రెస్ సర్కారు లాక్కుంటోందని మండిపడ్డారు. పట్టాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, పరిగిలో స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే అక్రమంగా భూసేకరణ జరుగుతోందని ఆరోపించారు. రైతులకు పట్టాలు ఇచ్చి, తగిన నష్టపరిహారం చెల్లించి, వారి అంగీకారంతోనే భూములు తీసుకోవాలని, లేదంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.



### లగచర్ల అరాచకాలను మర్చిపోం..

లగచర్లలో రేవంత్ రెడ్డి అరాచకాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని కేటీఆర్ అన్నారు. భూములు ఇవ్వనందుకే దళిత, గిరిజనులపై అక్రమంగా పోలీసు కేసులు పెట్టించి దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. గిరిజన బిడ్డలను జైల్లో పెట్టారని, గుండెపోటు వచ్చినా కనీస వైద్యం అందించకుండా బేడీలు వేసి తిప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు లాక్కోవద్దని పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై సైతం కాంగ్రెస్ సర్కారు అక్రమంగా కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు.

### మూడు రూపాయల పనీ ఇవ్వలే..

ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని కేటీఆర్ విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం కింద 12 లక్షలు ఇస్తామని చెప్పి కనీసం పన్నెండు పైసలు కూడా ఇవ్వలేదన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 72 శాతం కాంట్రాక్టులు ఇస్తామని రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని గుర్తుచేశారు. 4,400 కోట్ల ప్రాజెక్టులో ఆ వర్గాలకు 3 వేల కోట్ల కాంట్రాక్టులు ఇవ్వాల్సి ఉండగా.. కనీసం మూడు రూపాయల పని కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

### ఓట్ల కోసమే రైతుబంధు..

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాట్లు వేసే సమయానికే రైతుబంధు పడేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో కేవలం ఓట్ల కోసమే రైతుబంధు వేస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికలకు ఒకసారి, పంచాయతీ ఎన్నికలకు ఒకసారి ఇచ్చి.. ఇప్పటికి ఏకంగా మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# మత్తుపై ఉక్కుపాదం!

- డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం
- ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- పోలీసులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఈగల్ స్క్వాడ్‌కు పూర్తి అండ
- సమాజంలో మార్పుతోనే నిర్మూలన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ :** రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మత్తు పదార్థాల రవాణా, వినియోగంలో ఎంతటి పెద్దవారున్నా, రాజకీయ పలుకుబడి ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. శిల్పకళా వేదికలో ఈగల్ స్క్వాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీ నటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి తదితరులు పాల్గొన్నారు. యువత మత్తు బారిన పడకుండా ఉండటమే తమ ప్రభుత్వ కల అని ఆయన ఉద్ఘాటించారు.



### ఈగల్ స్క్వాడ్‌కు భరోసా..

డ్రగ్స్ కట్టడికి ప్రాణాలకు తెగించి రిస్క్‌లో పనిచేస్తున్న పోలీసు అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక ఇన్సెంటివ్‌లు అందజేస్తోందని భట్టి ప్రకటించారు. మత్తును అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ స్క్వాడ్ విభాగానికి ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నట్లే, ప్రభుత్వం కూడా వారి భవిష్యత్తును రక్షించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇందుకోసం పాఠశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### సామాజిక మార్పుతోనే సాధ్యం..

డ్రగ్స్ రహిత సమాజం కోసం కఠిన చట్టాలు తెస్తున్నప్పటికీ, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రానంతవరకు 100 శాతం ఫలితాలు సాధించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నా అది పూర్తిస్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదహరించారు. సినీ రంగంలో ఉన్నవారు కూడా సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని, ప్రజల్లోకి బలమైన సందేశాన్ని పంపాలని ఆయన పిలుపునిచ్చారు.

# మత్తుపై పోరుకు ఏకమవుదాం!

**డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి లక్ష్యం..**

**మత్తు మహమ్మారితో కుటుంబాలు నాశనం..**

**చట్టాలు, పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదు..**

**సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ కదలాలి**

**రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**

**హైదరాబాద్ :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సందేశం ఇచ్చారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కేవలం పోలీసుల చర్యలతోనే ఇది సాధ్యం కాదని, ప్రజలంతా ఏకమై సామాజిక బాధ్యతగా ఈ మత్తుపై పోరాటం చేయాలని సీఎం ఆకాంక్షించారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటు మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



### ఆ చైతన్యంతోనే శాశ్వత పరిష్కారం..

కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి పోలీసులకు సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ ముందుకు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# మరో ముల్కీ ఉద్యమం తప్పదు!

**తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత సర్కారుదే**

**స్థానికత నిబంధనలతో యువతకు తీవ్ర అన్యాయం**

**కోర్టులో వాదనలు వినిపించడంలో టీఎస్పీఎస్సీ విఫలం**

**ఉద్యోగులను దారుణంగా మోసం చేసిన సీఎం రేవంత్**

**బీఆర్ఎస్ నేత, మాజీ ఉద్యోగ సంఘాల నేత దేవీప్రసాద్**

**హైదరాబాద్ :** తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రంలో మరో ముల్కీ ఉద్యమం రావడం ఖాయమని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ హెచ్చరించారు. స్థానికత నిబంధనల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త రూల్స్ వల్ల తెలంగాణ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత భుజంగరావు, టీజీపీఎస్ఏ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర చారితో కలిసి దేవీప్రసాద్ మీడియాతో మాట్లాడారు. 3 ఏళ్లు తెలంగాణలో బీటెక్, బీఆర్క్ చదివితే ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ స్థానికులు ఎలా అవుతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఇతర రాష్ట్రాల వారిని మొత్తం స్థానికులుగానే భావించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల్లో చదువుకున్న తెలంగాణ విద్యార్థులను మాత్రం అక్కడ స్థానికులుగా గుర్తించడం లేదని ఆయన గుర్తుచేశారు.

### కోర్టులో టీఎస్పీఎస్సీ విఫలం..

ఆంధ్ర ప్రాంతానికి చెందిన పల్లా నిశాంత్ కేసు వ్యవహారంలో తెలంగాణ వారికి తీరని అన్యాయం జరుగుతోందని దేవీప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో తీర్పు ఇచ్చిన జడ్జిని తాము తప్పుబట్టడం లేదని, కానీ కోర్టులో సరైన వాదనలు వినిపించడంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ దారుణంగా విఫలమైందని విమర్శించారు. గతంలో ఇలాంటి సాంకేతిక సమస్యల వల్లే ఆదిలాబాద్, కుమ్రంభీం జిల్లాల నిరుద్యోగులు నష్టపోయారని గుర్తుచేశారు. ఆ పరిస్థితులను గమనించే గతంలో కేసీఆర్ 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా.. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు తెలంగాణలో చదివిన వారినే స్థానికులుగా గుర్తించేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని ప్రస్తావించారు. స్థానికత అంశంపై రాష్ట్రంలో మళ్లీ అలజడులు రేగే ప్రమాదం ఉందని దేవీప్రసాద్ హెచ్చరించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన రీతిలో కౌంటర్ దాఖలు చేయలేదని, వెంటనే జీఏడీ అధికారులు, చీఫ్ సెక్రటరీ సమావేశం నిర్వహించి దీనిపై గట్టి న్యాయపోరాటం చేయాలని సూచించారు. మరోవైపు సభలో సీఎం రేవంత్ రెడ్డి తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశపడిన ఉద్యోగులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్ గురించి సీఎం అసలు మాట్లాడటమే లేదని, ఈ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేస్తోందని విమర్శించారు. నాడు కేసీఆర్ విద్యావకాశాలను మెరుగుపరిస్తే.. నేడు నిర్వీర్యం చేస్తున్నారని భుజంగరావు ధ్వజమెత్తారు.

# రాష్ట్ర కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

- జూన్ 30న సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ
- అదే రోజు కొత్త సీఎస్‌గా బాధ్యతల స్వీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జాజు ట్రాక్ రికార్డుకే సీఎం రేవంత్ మొగ్గు
- 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి రాక

**హైదరాబాద్ :** తెలంగాణ పరిపాలనా యంత్రాంగంలో కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీఎస్ కే.రామకృష్ణారావు పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుండగా.. సరిగ్గా అదే రోజు సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత పదవిని స్వీకరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయనను రిలీవ్ చేసి మాతృ క్యాడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## డిజిటల్ పాలనలో నిష్ణాతుడు..

సంజయ్ జాజుకు ఉమ్మడి రాష్ట్రంతో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ శాఖ కార్యదర్శిగా పనిచేసినప్పుడు ప్రజలకు ఎంతో ఉపయోగపడే 'మీసేవ', మున్సిపల్ పరిధిలో 'సౌకర్యం' ప్రాజెక్టులను డిజైన్ చేసి విజయవంతంగా అమలు చేశారు. ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి కలెక్టర్‌గా,



విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పనిచేసి క్షేత్రస్థాయి పాలనపై తిరుగులేని పట్టు సాధించారు.

## ఢిల్లీలో విస్తృత నెట్ వర్క్..

గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తూ.. రక్షణ ఉత్పత్తి, సమాచార ప్రసారాల శాఖ కార్యదర్శిగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్రంలో సుదీర్ఘకాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిల్స్‌లోని ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకున్న నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఏరికోరి ఎంపిక..

ప్రస్తుత సీఎస్ రిటైర్మెంట్ తరుణంలో రేసులో పలువురు సీనియర్ల పేర్లు వినిపించినా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. ఆయనకున్న క్లీన్ ఇమేజ్, వివాదరహిత ట్రాక్ రికార్డే ఇందుకు ప్రధాన కారణం. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న సీఎంకు.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు కరెక్ట్ అని భావించారు. కేంద్ర నిధుల సాధన, పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకున్న పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం విశ్వసించారు.

## ముందున్న సవాళ్లు ఇవే..

చాలా ఏళ్ల తర్వాత సొంత రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న గ్యారంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

- 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం ఏర్పాటు
- వికారాబాద్ జిల్లా చేవెళ్లలో నిర్మించనున్న రాష్ట్ర సర్కారు
- దేశంలోనే తొలి డేటా సెంటర్ నగరంగా గుర్తింపు
- మౌలిక సదుపాయాల కల్పనపై సీఎస్, ఐటీ శాఖల ఆమోదం
- తాగునీటిపై భారం పడకుండా మురుగునీటి శుద్ధి, వినియోగం



**హైదరాబాద్ :** సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవల కోసం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్టు దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది.

## భారీ మౌలిక సదుపాయాలతో..

హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు.

## ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో సేవలు..

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి.

## కూలింగ్ కోసం మురుగునీరే..

దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచి నీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుంచి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

## ఐటీ దిగ్గజాలకు నిలయంగా హైదరాబాద్

కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాకు 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్టులో కంపెనీలకు నిరంతరాయంగా ఓపెన్ యాక్సెస్ పవర్ అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్ ఎస్, క్యాపిటాలాండ్, ఎస్టీటీ గ్లోబల్, ఎన్‌టీటీ డేటా లాంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్!

**హైదరాబాద్ :** నైరుతి రుతుపవనాలు ఏపీలో చురుగ్గా విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం మరోసారి భారీ వర్ష సూచన జారీ చేసింది. జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని, పొలాల్లో ఉండే కూలీలు, రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల



వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. .

## తెలంగాణలోనూ మూడు రోజులు వానలు..

అటు తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26, 27 తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27, 28 తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వానలు కురుస్తాయని తెలిపింది. జూన్ 28, 29 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలను జారీ చేసింది.

# సీఎం సలహాదారుగా రామకృష్ణారావు

- ఒకేసారి 13 మంది అధికారుల ట్రాన్స్‌ఫర్
- సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్
- సీఎంవో నుంచి అజిత్ రెడ్డి ఔట్
- జీఏడీకి అహ్మద్ నదీమ్ నియామకం



**హైదరాబాద్ :** రాష్ట్రంలో పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాలనా యంత్రాంగంలో భారీ ప్రక్షాళన చేపడుతూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కే రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ (సలహాదారు), ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జీవో ఆర్టీ నంబర్ 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకే రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్ శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంవోలో సేవలందించిన అజిత్ రెడ్డిని అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు.

## పలువురికి అదనపు బాధ్యతలు..

ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించారు. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌కు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావుకు అదనపు బాధ్యతలు దక్కాయి. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయని దేవిని నియమించారు.

## కీలక విభాగాలకు కొత్త అధికారులు..

హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కే చంద్రకళ, తెలంగాణ రెడ్ కో చైర్మన్ కమ్ ఎండీగా ముషారఫ్ అలీ నియమితులయ్యారు. ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టీ వెంకన్న, రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కే విద్యాసాగర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ప్రైవేట్ అక్రమాలపై కన్నేయాలి!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి
- హైకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందే
- కనీస వసతులు లేని కాలేజీలపై చర్యలు
- అర్హులైన విద్యార్థులకు న్యాయం జరగాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్

**హైదరాబాద్ :** ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేకుండా ఫీజులు దండుకుంటున్న కాలేజీలపై విజిలెన్స్ నివేదికల ఆధారంగా కొరడా ఝుళిపించాలన్నారు. అలాగే హైకోర్టు ఆదేశాల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కచ్చితంగా కనీస విద్యా ప్రమాణాలు, వసతులను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా, ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## హైకోర్టు ఆదేశాలు పాటించాలి..



ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

## నిధులు సద్వినియోగం కావాలి..

ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజయశాంతి కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు.



# వెనిజువెలా విలయం

## చమురు రంగానికి భారీ షాక్

## భారత చమురు దిగుమతులకు బ్రేక్

లాటిన్ అమెరికా దేశమైన వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4,300 మంది తీవ్రంగా గాయపడ్డారని, భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది జాడ తెలియరాలేదని ఆధికారిక వర్గాలు వెల్లడించడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పర్యావరణ విధ్వంసం కూడా ఈ స్థాయి భూకంపాలకు కారణమై ఉండొచ్చని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన 'లా గువేరా' తీర నగరంలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస (ఖచీ) ప్రతినిధులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు.

### సోషల్ మీడియాపై ఆంక్షలు ఎత్తివేత..

భూకంప విపత్తు నేపథ్యంలో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకునేందుకు వీలుగా సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' (ట్విట్టర్) పునరుద్ధరించబడింది. గత 2024లో నికోలస్ మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే.

### సహాయానికి కదిలిన అంతర్జాతీయ సమాజం

ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీనిని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బందిని, వైద్య బృందాలను, మానవతా సాయాన్ని పంపేందుకు సిద్ధమయ్యాయి.

### భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం!

ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా ఆర్థికంగా, వాణిజ్యపరంగా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఇటీవలి ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితియోంల్లో భూకంపం వల్ల అక్కడి నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థ స్తంభించడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే, భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ (రాచీ+జ ఎఱఐవంష్ర)కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో భారీ పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. వెనిజువెలా కోలుకుని, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు భారత వ్యాపారాలకు ఇది పెద్ద దెబ్బగానే భావించాల్సి ఉంటుంది.



# సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు


■ ఎన్నికల సంఘం కీలక ప్రకటన




**న్యూఢిల్లీ, జూన్ 26:** తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో పాస్‌పోర్ట్ పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ముఖ్యమైన వివరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్న లేదా ప్రస్తుతం వివరాలను సవరించుకోవాలన్నా అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో పాస్‌పోర్ట్ కూడా ఒకటిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరణ సాధారణ ఓటర్లకు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంతో ఊరటనిచ్చే అంశం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 1967 పాస్‌పోర్ట్ చట్టాన్ని ఉటంకిస్తూ, పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ, అది పౌరసత్వానికి నిరూపణ కాదని పేర్కొంది. ఈ ప్రకటన సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ పౌరసత్వం విషయంలో సమస్యలు వస్తాయా? ఓటర్ల జాబితాలో పాస్‌పోర్ట్ ఆధారంగా పేరు నమోదు చేయడం సాధ్యం కాదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తి పేరు చేర్చడానికి ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండటం, నిర్ణీత వయసు కలిగి ఉండటం ప్రాథమిక సూత్రం. దీనిని నిరూపించడానికి ఓటరు నమోదు అధికారి కొన్ని పత్రాలను పరిశీలిస్తారు. ఈ పత్రాల జాబితాలో పాస్‌పోర్ట్ ఎప్పటి నుంచో ఉంది. అది అలాగే కొనసాగుతుంది. "పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును, నివాసాన్ని ధృవీకరించే కీలక పత్రం. ఇందులో ఎలాంటి మార్పు లేదు" అని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. గతంలో బిహార్‌లో జరిగిన SIR, అసోంలో జరిగిన ప్రత్యేక సవరణలు, ఆ తర్వాత జరిగిన వివిధ దశల ఓటర్ల జాబితా సవరణలలో కూడా పాస్‌పోర్ట్‌ను ఒక ప్రామాణిక పత్రంగానే పరిగణించారు. గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కొత్త విధానాన్ని తీసుకురాలేదని, పాత పద్ధతులే అమల్లో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంటే దశాబ్ద కాలంగా పాస్‌పోర్ట్ అనేది ఓటరుగా నమోదు కావడానికి ఒక నమ్మదగిన ఆధారంగా ఉంటూ వస్తోంది. చట్టపరంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి భారత వెలుపలికి వెళ్లడానికి లేదా తిరిగి రావడానికి ఇచ్చే ప్రయాణ పత్రం. అయితే ఓటర్ల జాబితా తయారీ సమయంలో , సదరు వ్యక్తి వివరాలను సరిచూడటానికి అధికారులు కోరే 12 పత్రాలలో ఇది ఒకటి. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ దరఖాస్తుదారు సమర్పించిన ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటు హక్కుపై నిర్ణయం తీసుకుంటారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసేటప్పుడు పాస్‌పోర్ట్ మాత్రమే కాకుండా, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి మరో 11 పత్రాలను కూడా ప్రభుత్వం అనుమతిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కానీ, ఎన్నికల సంఘం కానీ పాస్‌పోర్ట్ ప్రాముఖ్యతను తగ్గించే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారు పత్రాలను అంగీకరించే పూర్తి అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. పాస్‌పోర్ట్ సమర్పించినప్పుడు దాన్ని నిరాకరించడానికి వీలులేదని తాజా వివరణ ద్వారా స్పష్టమవుతుంది.

# ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



**న్యూఢిల్లీ, జూన్ 26:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!



- ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !
- ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 26:** సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు. ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.



# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

## కేంద్రం తాజా అంచనాలు

**న్యూఢిల్లీ, జూన్ 26:** ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?÷-లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

## భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

## ఇమామ్ త్యాగాన్ని స్మరించుకున్న ప్రధాని




**న్యూఢిల్లీ, జూన్ 26:** మొహర్రం పవిత్ర మాసం సందర్భంగా.. సత్యం, ధర్మం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన అత్యున్నత త్యాగాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (గతంలో ట్విట్టర్) ద్వారా ఒక సందేశాన్ని పంచుకున్నారు. "హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగం.. సత్యం, న్యాయం కోసం స్థిరంగా పోరాడేలా ఎంతో మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఇది అచంచలమైన ధైర్యం, విశ్వాసానికి సజీవ ప్రతీకగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ తెలిపారు. స్లాం మత ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త మనవడే (కూతురు ఫాతిమా, అల్లుడు అలీల కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుస్సేన్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంలో 10వ రోజును 'ఆషూరా' ( అని పిలుస్తారు. ఈ రోజున షియా ముస్లింలు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరుల అమరత్వాన్ని స్మరించుకుంటూ, దీనిని అత్యంత విషాద దినంగా పాటిస్తారు. క్రీస్తుశకం 680 (హిజ్రీ సంవత్సరం 61)లో ప్రస్తుత ఇరాక్ దేశంలోని 'కర్బలా' అనే ప్రాంతంలో జరిగిన చారిత్రాత్మక యుద్ధంలో ఈ మహా త్యాగం జరిగింది. ఆ సమయంలో ఉమయ్యద్ రాజవంశానికి చెందిన పాలకుడు యజీద్ , తనను ఇస్లామిక్ సామ్రాజ్యానికి ఏకైక నాయకుడిగా (ఖలీఫాగా) అందరూ అంగీకరించాలని డిమాండ్ చేశాడు. అయితే, యజీద్ ఒక క్రూరుడు, అవినీతిపరుడు, ఇస్లాం ప్రాథమిక, నైతిక సూత్రాలకు విరుద్ధంగా పాలించేవాడు. ఆయన పాలనను అంగీకరిస్తే, అది సత్యం, ధర్మాన్ని కాలరాయడమే అవుతుందని ఇమామ్ హుస్సేన్ దృఢంగా భావించారని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా లోని ఇస్లామిక్ హిస్టరీ అండ్ బ్యాటిల్ ఆఫ్ కర్బలా చెబుతోంది. అధికార దాహంతో ఉన్న యజీద్‌కు లొంగిపోవడానికి నిరాకరించిన ఇమామ్ హుస్సేన్, కేవలం 72 మంది కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి యజీద్ పంపిన వేల మంది సైన్యంతో కర్బలా మైదానంలో ఎదురునిలిచారు. ఆ చిన్న సమూహంలో 6 నెలల పసికందుతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. శత్రువులు వారి దారుణత్వాన్ని ప్రదర్శిస్తూ, యూఫ్రటీస్ నది నుంచి ఇమామ్ హుస్సేన్ బృందానికి చుక్క నీరు కూడా అందకుండా మూడు రోజుల పాటు అడ్డుకున్నారు. మండుటెండలో దాహంతో అలమటిస్తున్నప్పటికీ వారు ధర్మాన్ని వీడలేదు. చివరగా, ఆషూరా రోజున జరిగిన అసమాన పోరులో హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులు అత్యంత దారుణంగా, వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు.

# పాఠశాలలు, పిల్లలపై దాడులు ఉపేక్షించం

## దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దు

## ఐరాసలో గళమెత్తిన భారత ప్రతినిధులు



**న్యూఢిల్లీ, జూన్ 26:** ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాల్లో నలిగిపోతున్న పిల్లలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దుల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణల సమయంలో పాఠశాలలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దని, చట్టం ముందు నిలబెట్టాలని భారత్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ ఈ మేరకు స్పష్టం చేసింది. కేవలం పిల్లలకు రక్షణ కల్పించడం మాత్రమే సరిపోదని, వారిపై అఘాయిత్యాలకు ఒడిగట్టే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించినప్పుడే ఆ రక్షణకు పూర్తి అర్థం చేకూరుతుందని నొక్కి చెప్పింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ భద్రతా మండలిలో జరిగిన "సంఘర్షణల ప్రభావితమైన పిల్లల విద్యా సంరక్షణ - నిబంధనల అమలు" అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధాలు, అంతర్గత కలహాల వల్ల తీవ్రంగా నష్టపోయేది భవిష్యత్తు తరమైన పిల్లలేనని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. భీకర ఘర్షణల సమయంలో కూడా విద్య అనేది పిల్లల ప్రాథమిక హక్కుగా కొనసాగాలని, దీన్ని ఏ శక్తీ హరించలేదని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు. సమాజంలో శాశ్వత శాంతిని స్థాపించడంలో విద్య అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని, సాయుధ పోరాటాల్లో పిల్లల ప్రాణాలను కాపాడటానికి, వారి విద్యా హక్కును రక్షించడానికి భారతదేశం ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పాఠశాలలపై బాంబుల వర్షం కురిపిస్తూ, బాల్యాన్ని చిదిమేస్తున్న శక్తుల పట్ల అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించకపోతే మానవాళికే ముప్పని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హక్కుల ఉల్లంఘనలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన స్థాయికి చేరుకున్నాయని భారత్ గుర్తుచేసింది. ఈ మేరకు ఇటీవల ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ సమర్పించిన నివేదికలోని గణాంకాలను ప్రస్తావించింది. ఈ నివేదికలోని గణాంకాలు అంతర్జాతీయ సమాజపు సామూహిక వైఫల్యానికి అద్దం పడుతున్నాయని విచారం వ్యక్తం చేసింది. కేవలం ఒక సంవత్సర కాలంలోనే పిల్లలపై ఏకంగా 38,558 తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఐరాస నివేదిక చెబుతోంది. వీటివల్ల ప్రపంచవ్యాప్తంగా 24,174 మంది పిల్లలు ప్రత్యక్షంగా నష్టపోయారు. ఇందులో 15,493 మంది బాలురు, 7,990 మంది బాలికలు ఉండగా, మిగిలిన వారి వివరాలు లభ్యం కాలేదు. ఐక్యరాజ్యసమితి ఈ రికార్డులను సేకరించడం ప్రారంభించిన తర్వాత, ఇంత భారీ సంఖ్యలో పిల్లలు హింసకు గురికావడం ఇదే మొదటిసారి. యుద్ధాలు, అంతర్గత కలహాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలపై ఒకటి కంటే ఎక్కువసార్లు జరుగుతున్న దాడుల సంఖ్య కూడా ఏటా పెరిగిపోతోందని నివేదిక చెబుతోంది. యుద్ధ నిబంధనలను, అంతర్జాతీయ మానవతా చట్టాలను ఆయా పక్షాలు తుంగలో తొక్కుతున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమిటంటే, కేవలం ఒక్క ఏడాదిలోనే పాఠశాలలు, విద్యాసంస్థలపై జరిగిన దాడుల సంఖ్య 44 శాతం పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 47.3 కోట్ల మంది పిల్లలు అంటే ప్రపంచంలోని ప్రతి ఆరుగురిలో ఒకరు యుద్ధ వాతావరణంలో బతుకుతున్నారు లేదా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోతున్నారని ఐరాస నివేదిక చెప్పింది. వీరిలో 8.5 కోట్ల మందికి పైగా పిల్లలకు అసలు చదువుకునే భాగ్యమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదని, ఆయా దేశాల భవితవ్యాన్ని కూడా నాశనం చేస్తోందని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. దురదృష్టవశాత్తూ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ బలగాలే బాధ్యతారహితంగా ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులకు కారణమవుతున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. ఈ సంక్షోభ పరిస్థితుల్లో పిల్లల రక్షణ కోసం భారత్ కొన్ని పరిష్కార మార్గాలను సూచించింది. ప్రతి దేశంలోనూ పిల్లల విద్యా హక్కును కాపాడటంలో ఆయా ప్రభుత్వాలదే ప్రాథమిక బాధ్యత అని ఐరాస వేదికపై భారత్ స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత్ సాధించిన ప్రగతిని హరీష్ పర్వతనేని వివరించారు. భారతదేశంలో 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించేలా 'విద్యా హక్కు'ను రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కుగా మార్చినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు, పేద పిల్లలకు కూడా నాణ్యమైన విద్యను చేర్చడానికి భారత్ సాంకేతికతను అందిపుచ్చుకుందని, ఇందులో భాగంగానే దేశంలో 'దీక్ష' అనే జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను విజయవంతంగా నడుపుతోందని చెప్పారు. కోవిడ్ మహమ్మారి సమయంలో పాఠశాలలు మూతపడినప్పుడు ఈ డిజిటల్ విద్య ఎలాగైతే కోట్ల మంది పిల్లల చదువులను కాపాడిందో, అదే విధంగా యుద్ధాలు, ఘర్షణల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లోని పిల్లలకు విద్యను అందించడానికి డిజిటల్ లెర్నింగ్ ఒక అద్భుతమైన వంతెనలా ఉపయోగపడుతుందని భారత్ ప్రపంచానికి దిశా నిర్దేశం చేసింది. భారతదేశం కేవలం తన దేశ సరిహద్దులకే పరిమితం కాకుండా, పొరుగు దేశాలలోని శరణార్థులు, అంతర్గతంగా నిరాశ్రయులైన కుటుంబాల పిల్లల చదువుల కోసం నిరంతరం పాటుపడుతోందని హరీశ్ స్పష్టం చేశారు. యుద్ధం వల్ల సర్వస్వం కోల్పోయిన పొరుగు దేశాల్లో విద్యా మౌలిక వసతులను నిర్మించడం, పాఠశాలలను పునర్నిర్మించడం, యువతకు ఉపాధి కల్పించే వృత్తి విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయడంలో భారత్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటూ తన బాధ్యతను చాటుకుంటోందని భద్రతా మండలి వేదికగా భారత్ ప్రకటించింది.



# సమిష్టిగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దాం

## భారత్-యూఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 26:** భారత్, అమెరికా సంబంధాలలో కీలక పరిణామం జరిగింది. ఇరు దేశాల వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నంలో భాగంగా భారత్, అమెరికాలు ఒక రహస్య రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో ఇరు దేశాల సీనియర్ ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక నాయకులు పాల్గొని ఏఐ, సెమీకండక్టర్ సరఫరా గొలుసులు, కీలక ఖనిజాల రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో కలిసికట్టుగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దామని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ మీటింగ్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ అమెరికాలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. "చిప్స్, కీలక ఖనిజాలు, ఏఐ రంగాలలో పనిచేస్తున్న భారతీయ, అమెరికన్ కంపెనీల బృందాన్ని ఉద్దేశించి అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్, వాణిజ్య శాఖ డిప్యూటీ అండర్ సెక్రటరీ బిల్ గైడెరా ప్రసంగించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని యూఎస్‌లోని ఇండియన్ ఎంబసీ యూఎస్ఐఎస్‌పీఎఫ్, సిల్వరాడో పాలసీ యాక్సిలరేటర్ (పరిశోధనా సంస్థ)తో కలిసి నిర్వహించింది. ఈ మీటింగ్‌లో జరిగిన చర్చలలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్ నాయుడు, యూఎస్ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్? అఘి, ఇంధన శాఖ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ క్రిస్టోఫర్ సల్దానా కూడా పాల్గొన్నారు. పెట్టుబడి వాతావరణాన్ని బలోపేతం చేయడం, ఏఐ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడంపై ఈ రౌండ్ టేబుల్ సమావేశం దృష్టి సారించింది" అని అమెరికాలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్ పోస్టులో పేర్కొంది. కొద్ది రోజుల క్రితం అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా పెట్టుబడి విస్తరణ, సరఫరా గొలుసు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల గురించి చర్చించడానికి అగ్రశ్రేణి కార్పొరేట్, టెక్నాలజీ నాయకులతో పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. అమెరికాతో దిల్లీకి పెరుగుతున్న ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. భారత మార్కెట్లో తమ ఉనికిని మరింత విస్తరించుకోవడంపై చర్చించడానికి రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో సమావేశమయ్యారు. "దేశంలో వాల్‌మార్ట్ పెట్టుబడులు, దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, పటిష్టమైన సరఫరా గొలుసులను నిర్మించాలనే నిబద్ధతపై ఆ కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో ఫలప్రదమైన చర్చలు జరిపా " అని వినయ్ క్వాత్రా పేర్కొన్నారు. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని అహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశంలో జూన్ 27-29 వరకు పర్యటించనున్నారు. జూన్ 29న జరిగే సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. అలాగే సెషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రవాస భారతీయులతో కూడా సమావేశమవుతారు. అయితే మోదీ పర్యటన నేపథ్యంలో విక్టోరియా-మహే ప్రాంతమంతటా ప్రవాస భారతీయులు ఆయనకు స్వాగతం పలుకుతూ పోస్టర్లను ఏర్పాటు చేశారు.

# విగ్ కారణం కాదు: కేతన్ తండ్రి క్లారిటీ

## ముందే తెలుసు.. చంపాల్సిన అవసరం లేదు

## ట్రెక్కింగ్‌కు వెళ్దామని సియానే కోరింది

## కేతన్ అంటే ఇష్టమని సియా చెప్పింది

## విగ్ ప్రచారాన్ని ఖండించిన తండ్రి

**ముంబై, జూన్ 26:** కేతన్ అగర్వాల్ విగ్ పెట్టుకోవడం ఇష్టంలేని కారణంగానే సియా గోయల్ అతడిని హత్య చేసిందంటూ వస్తున్న వార్తలపై కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. తన కొడుకు హత్యకు, అతడు విగ్ పెట్టుకోవడానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిశ్చితార్థం జరగడానికి ముందే కేతన్ విగ్ వాడుతున్నాడనే విషయం సియా కుటుంబసభ్యులకు తెలుసునని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విశాల్ మీడియాతో మాట్లాడుతూ.. "కేతన్ చిన్న విగ్ ప్యాచ్ పెట్టుకుంటాడన్నది నిజమే. ఎంగేజ్‌మెంట్‌కు ముందే మేము ఈ విషయాన్ని సియాకు, ఆమె కుటుంబానికి స్పష్టంగా చెప్పాము. ఒకవేళ సియాకు అది నచ్చకపోతే అప్పుడే పెళ్లి వద్దని చెప్పేది. అంతేకానీ నా కొడుకు ప్రాణాలు తీయాల్సిన అవసరం ఏముంది?" అని ఆవేదన వ్యక్తం చేశారు.

### ట్రెక్కింగ్‌కు వెళ్దామని సియానే కోరింది..!

కేతన్ బలవంతం చేయడం వల్లే సియా లోహగడ్ కోటకు ట్రెక్కింగ్‌కు వెళ్లిందని ఆమె తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలను కూడా విశాల్ అగర్వాల్ తప్పుబట్టారు. తనకు తెలిసినంత వరకు సియానే ట్రెక్కింగ్‌కు వెళదామని కేతన్‌ను కోరిందని ఆయన తెలిపారు. మరోవైపు సియా తల్లిదండ్రులు సైతం ఈ ఘటనపై మీడియాతో మాట్లాడారు. "పెళ్లి ఖాయం చేసే ముందు సియాను దాదాపు పదిసార్లు పెళ్లి ఇష్టమేనా అని అడిగాం. మేము అడిగిన ప్రతిసారీ తనకు కేతన్ అంటే ఇష్టమనే చెప్పింది. ఎప్పుడూ కూడా అతడంటే ఇష్టం లేనట్లు ప్రవర్తించలేదు. అలాగే ఆమెకు వేరే ఎవరితోనైనా ప్రేమ వ్యవహారం ఉందన్న సంగతి కూడా మాకు తెలియదు" అని వారు పేర్కొన్నారు.



# ఎన్యుమరేషన్ ఫారం నింపేటప్పుడు

- జాగ్రత్తలువివరాలు స్పష్టంగా, తప్పులు లేకుండా నమోదు చేయాలి.
- ఫారం సమర్పించిన తర్వాత రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- తాజా కలర్ ఫొటోను అతికించడం మర్చిపోవద్దు.

**రాయపోల్, జూన్ 26:**

ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి తెలుగు లేదా ఆంగ్ల భాషల్లో ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. ఈ ఫారం నింపే విధానంపై చాలామందికి అవగాహన లేకపోవడంతో, సరైన సమాచారం నమోదు చేయడం ఎంతో అవసరం.

**ఎన్యుమరేషన్ ఫారం అంటే...**

ఓటరు వివరాలను ధ్రువీకరించడం,అవసరమైన మార్పులు నమోదు చేయడం, కొత్త ఓటర్ల వివరాలను సేకరించడం కోసం ఎన్నికల సంఘం ఉపయోగించే ప్రాథమిక దరఖాస్తు ఇదే. ఫారంలో అన్ని వివరాలను స్పష్టమైన అక్షరాలతో,ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి.

**ఫారంలోని విభాగాలు**

ఫారం ప్రారంభ భాగంలో ఓటరు పేరు,ఓటరు గుర్తింపు



కార్డు (ఈపీఐసీ) సంఖ్య, చిరునామా,అసెంబ్లీ నియోజకవర్గం వంటి వివరాలు ముందుగానే ముద్రించి ఉంటాయి.అక్కడ సూచించిన స్థానంలో తాజా కలర్ ఫొటోను అతికించాలి.

**మొదటి భాగం**

ఈ విభాగంలో 01-01-2002 నాటికి ఓటు హక్కు ఉన్నవారికి,లేనివారికి వేర్వేరు కాలమ్‌లు ఉంటాయి.తమకు వర్తించే కాలమ్‌ను మాత్రమే పూర్తి చేయాలి.

**01-01-2002 నాటికి ఓటు హక్కు ఉన్నవారు:**

2002 ఓటరు జాబితా ఆధారంగా పేరు,ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య, సంరక్షకుడి పేరు,బంధుత్వం, అప్పటి శాసనసభ నియోజకవర్గ సంఖ్య,పోలింగ్ స్టేషన్ నంబర్,ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య (సీరియల్ నంబర్) నమోదు చేయాలి.

**01-01-2002 నాటికి ఓటు హక్కు లేనివారు:**

ఈ విభాగంలో తండ్రి,తల్లి, తాత లేదా నానమ్మలో ఎవరో ఒకరి వివరాలు నమోదు చేయాలి.వారి పేరు,ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య, బంధుత్వం,2002 నాటి శాసనసభ నియోజకవర్గ సంఖ్య,పోలింగ్ స్టేషన్ నంబర్, ఓటరు జాబితాలోని క్రమ సంఖ్యను నమోదు చేయాలి.

**మూడో భాగం**

ప్రస్తుత ఓటరు వివరాలను ఈ విభాగంలో నమోదు చేయాలి. పుట్టిన తేదీ,ఆధార్ సంఖ్య, మొబైల్ నంబర్,సంరక్షకుడి పేరు, సంరక్షకుడి ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య నమోదు చేయాలి.వివాహితులైతే జీవిత భాగస్వామి పేరు, వారి ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య నమోదు చేయాలి.అవివాహితులైతే ఆ కాలమ్‌ను ఖాళీగా ఉంచవచ్చు.

**సిద్ధంగా ఉంచాల్సిన పత్రాలు**

ఫారం నింపే సమయంలో ఆధార్ కార్డు,జనన ధ్రువీకరణ పత్రం,పాస్‌పోర్టు,పదో తరగతి సర్టిఫికెట్,శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం,ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్ను రసీదు లేదా విద్యుత్ బిల్లు వంటి అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. సరైన సమాచారం నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో ఓటరు జాబితాలో పేరు తొలగింపు లేదా ఇతర పొరపాట్లు చోటుచేసుకోకుండా నివారించవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. అలాగే ఫారం సమర్పించిన అనంతరం రశీదును తప్పనిసరిగా తీసుకుని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం.
- వ్యసనాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారమే.
- బంగారు భవిష్యత్తు కోసం యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.
- జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.

**నారాయణపేట, జూన్,26:**

డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్ లు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ , ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని, ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్‌లాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు.యువత ఎక్కువగా ఉన్న భారత




దేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రత కు భంగం కలిగించేలా చేస్తుందని,అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, RI విజయ్ భాస్కర్,ఎస్సైలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్సై లు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈలతో దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఊతం

**న్యూఢిల్లీ, జూన్ 26:.**

దేశ ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఎంఎస్ఎంఈల వాటా 31.1 శాతం కాగా, తయారీ రంగంలో 35.4 శాతం, ఎగుమతుల్లో 48.58 శాతం వాటా నమోదైంది. వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగంగా ఎంఎస్ఎంఈలు నిలిచాయి. ఈ రంగం ద్వారా దేశవ్యాప్తంగా 38.9 కోట్లకు పైగా మందికి ఉపాధి లభిస్తోంది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్, ఉద్యమ్ అసిస్ట్ ప్లాట్‌ఫామ్‌లలో 8.7 కోట్లకు పైగా సంస్థలు నమోదు అయ్యాయి. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రెండేళ్లలోనే 30 లక్షల మంది లబ్ధిదారుల నమోదు లక్ష్యం చేరుకుంది. అలాగే ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) ద్వారా 10.84 లక్షల సూక్ష్మ పరిశ్రమలకు మద్దతు అందించగా, 97 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు సృష్టించబడ్డాయి. ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలు అందేలా క్రెడిట్ గ్యారంటీ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల విక్రయాలు రూ.1.27 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి.

# ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**బొంరస్ పెట్ మండలం ,జూన్, 26:**

సిఐటియు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతి ఆటో డ్రైవర్ కి నెలకు ప్రభుత్వం నుండి 12 వేల రూపాయలు ఇస్తామని ఫ్రీ బస్సు ఉండడం వల్ల జనాలు ఆటోల్లో ప్రయాణం చేయనందున ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతూ కుటుంబ భారాన్ని మోయలేక ఆటో డ్రైవర్ల కుటుంబాలు పస్తులు ఉంటున్నారు అంతేగాక ప్రైవేటు ఫైనాన్స్. లో ఆటోల నెలవారి ఫైనాన్స్ డబ్బులు ఆటో డ్రైవర్లు కట్టకపోవడం వల్ల. ఆటోలను ఫైనాన్స్. వాళ్లు ఆటోలను డ్రైవర్ల నుండి డబ్బులు కట్ట లేనందువల్ల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఫైనాన్స్ వాళ్ళు గుంజుకో ని వెళ్తున్నారు ఆటో డ్రైవర్ల అందరూ దిక్కుతోచక వారి కుటుంబాలు బజారు పాలవుతున్నాయి సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బొంరస్ పేట మండలం తుంకిమెట్లలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు రాజేందర్. కార్యదర్శి అశోక్ దాసరి అంజలి గౌడ్ శివకుమార్ జి రవీందర్ మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## హజ్రత్ ఇమామ్ హుసైన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నివాళి

**న్యూ డిల్లీ జూన్26:.**

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హజ్రత్ ఇమామ్ హుసైన్ (అ.స.)కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, హజ్రత్ ఇమామ్ హుసైన్ చేసిన త్యాగం, సత్యం మరియు న్యాయం కోసం ఆయన చూపిన అచంచల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సత్యం, న్యాయం సాధనలో స్థిరంగా నిలవాలని ఆయన త్యాగం ప్రజలను నేటికీ ప్రేరేపిస్తోందని, ధైర్యం, దృఢ సంకల్పానికి ఆయన జీవితం శాశ్వత చిహ్నమని ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన సందేశంలో తెలిపారు.

## ఐస్‌లాండ్‌లో తొలిసారిగా భారత మామిడి పండ్ల ప్రదర్శన

**దషెహరి, చౌసా, లాంగ్రా, కేసర్ రకాలకు విశేష ఆదరణ**

**న్యూఢిల్లీ, జూన్ 26:(సమయం న్యూస్,).**

భారత రాయబార కార్యాలయం, రేక్యావిక్ మరియు అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సంయుక్తంగా ఐస్‌లాండ్‌లో తొలిసారిగా భారత మామిడి పండ్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించాయి. జూన్ 24న రేక్యావిక్‌లో, జూన్ 25న అకురేయిరిలో జరిగిన ఈ కార్యక్రమాల్లో దషెహరి, చౌసా, లాంగ్రా, కేసర్ రకాల భారతీయ మామిడి పండ్లను ప్రదర్శించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారుగా ఉన్నదని, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ విస్తరణ, ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. భారత్–ఈఎఫ్‌టీఏ వాణిజ్య ఒప్పందం ద్వారా ఐస్‌లాండ్‌కు భారత మామిడి ఎగుమతులు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. దౌత్యవేత్తలు, దిగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారత మామిడి పండ్ల రుచి, నాణ్యతకు విశేష ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం ఐస్‌లాండ్ మామిడి దిగుమతుల్లో ప్రధానంగా థాయ్‌లాండ్, బ్రెజిల్, కంబోడియా, ఘనా, పెరూ దేశాలపై ఆధారపడుతుండగా, 2025లో సుమారు 3.3 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన మామిడి పండ్లను దిగుమతి చేసుకుంది. భారతీయ మామిడి పండ్లకు కూడా అక్కడ మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం

**కలెక్టర్ దివాకర్ టీఎస్**




**ఖమ్మం జూన్26:.**

ఖమ్మంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొన్నారు. మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు వ్యాధి కంటే ప్రమాదకరమని, యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 1908కు తెలియజేయాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంపై ప్రతిజ్ఞ చేశారు.

## జగిత్యాలలో ఇందిరమ్మ గృహ విప్లవం

**జగిత్యాల జూన్26:**

జగిత్యాల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం వేగంగా అమలవుతోంది. జిల్లాకు మొత్తం 10,860 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 9,020 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 7,885 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉండగా, 1,568 ఇళ్లు పూర్తయ్యాయి. ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణలో భాగంగా 3,136 గృహ ప్రవేశాల లక్ష్యానికి గాను ఇప్పటికే 2,512 గృహ ప్రవేశాలు నిర్వహించారు. జిల్లాలో జగిత్యాల నియోజకవర్గానికి అత్యధికంగా 3,494 ఇళ్లు మంజూరు కాగా, కోరుట్లలో అత్యధికంగా 755 గృహ ప్రవేశాలు జరిగాయి. ధర్మపురి, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో కూడా నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి.ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు శాశ్వత గృహ భద్రత కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తోందని అధికారులు తెలిపారు. అధికారులు నిరంతర పర్యవేక్షణతో నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు.

## బీర్‌పూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**జగిత్యాల, జూన్ 26::**

జిల్లాలో గల బీర్‌పూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. అనంతరం ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించి వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలని అధికా



## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూన్ 26:.**



: జిల్లాలో జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో 'బూత్ డే'ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. జిల్లాలో 0–5 ఏళ్ల వయస్సు గల 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 381 పోలియో బూత్‌లు, 25 మొబైల్ బృందాలు, 24 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ఒక్క చిన్నారి కూడా మిగిలి పోకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ కార్మికుల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

## దేవరకద్ర కె.జి.బి.వి తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్ జూన్26:.**



దేవరకద్రలోని కె.జి.బి.వి (KGBV)ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కె.జి.బి.వి లో వంటగదిని, హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించి ఆహార తయారీ నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. అలాగే, వసతి, ఆహారం, పారిశుధ్యం, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థుల నుండి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు హాస్టల్ సౌకర్యాలకు సంబంధించిన తమ అనుభవాలను అదనపు కలెక్టర్ కు వివరించారు

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026పై సమీక్ష

**మహబూబ్ నగర్ జూన్26:**




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి గణన, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లతో వెబ్ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్డీఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిపల్లి గ్రామంలో నుతన కరెంటు స్తంభాలు వైర్లు ఏర్పాటు కార్యక్రమం

### పూజ చేసి పనులను ప్రారంభించిన సర్పంచ్ వెంకటయ్య



**కొడంగల్ మండలం, జూన్,26:**

కొడంగల్ మండలం అప్పాయి పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కరెంటు స్తంభాలు వైర్ల ఏర్పాటు కార్యక్రమానికి పూజ చేసి ప్రారంభించిన సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య రానున్న వర్షాకాలం నేపథ్యంలో పాత స్తంభాలను పాత వైర్లను తొలగించి కరెంటు సమస్యను లేకుండా చేయడానికి గ్రామము కొత్త స్తంభాలు కొత్త వైర్లు కనెక్షన్లు ఇస్తున్న విద్యుత్ అధికారులు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్ లైన్మెన్ అనిల్ గ్రామస్తులు గోకుల్ సింగ్ శ్రీనివాస్ అశోక్ నారాయణ క్రిష్టప్ప రాములు వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత తెలంగాణ సాధిద్దాం

- డ్రగ్స్ వీడండి... బంగారు భవితకు బాటలు వేసుకుకోండి : డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి
- డ్రగ్స్‌పై ఉక్కు పాదం : ఏసిపి కిషన్

**చేవెళ్ల, జూన్,26:**




భారతదేశ సమాజం , సంస్కృతిలో డ్రగ్స్, మదక ద్రవ్యాలకు తావు లేదని ప్రస్తుతం విస్తరిస్తున్న డ్రగ్స్ సంస్కృతిని కూకటి వేళ్ళతో పెకిలిద్దామని,డ్రగ్స్ రహిత సమాజాన్ని సాధిద్దామని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్లలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల జనరల్ హాస్పిటల్ లో ఫ్యూచర్ సిటీ పోలీసులు, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏసీపీ కిషన్ నిర్వహించిన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం 2026 అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు.మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థుల తో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ఉక్కు పాదం మోపుతూ గట్టి చర్యలు తీసుకుంటుందని వివరించారు. క్షణికానందం కోసం తెలిసి తెలియని వయసులో అవగాహన లేకపోవడంతో, కొందరు గంజాయికి, మద్యానికి, డ్రగ్స్ కు అలవాటు పడుతున్నారని, ఇలాంటివి ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఇలాంటి పరిస్థితుల నుండి యువతను రక్షించేందుకు పోలీసులు అవగాహన సదస్సును నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. డ్రగ్స్ రహిత తెలంగాణను సాధిద్దామని ఆయన అన్నారు. వైద్య విద్యార్థులు డ్రగ్స్ కు అలవాటు పడ్డ వారికి మానసికంగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ త్వరలో ప్రతి విద్యా సంస్థలను ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు యువతకు అవగాహన కల్పిస్తుందని వెల్లడించారు.ఏసిపి కిషన్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం నేర ప్రవృత్తిని పెంచుతుందని, ఇది ఉగ్రవాదం కంటే ప్రమాదకరమైందని వివరించారు. గంజాయి డ్రగ్స్ తదితరాల వినియోగించే వారు చట్టపరంగా కఠిన శిక్షలకు గురవుతారని, తమ బంగారు భవిష్యత్తును కోల్పోతారని అన్నారు. తెలిసి తెలియక డ్రగ్స్ కు అలగాటు వారిని నేరస్తులుగా గుర్తించడం శిక్షించడం అటు ఉంచితే వారి పరివర్తనకు డాక్టర్లు తమ వైద్యం ద్వారా సహకరించాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు వాటిని వాడుతూ చికిత్స కోసం ఆసుపత్రి కి వచ్చిన వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రతి విద్యాసంస్థలో ప్రభుత్వం డ్రగ్స్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేస్తుందని అన్నారు.ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ లో సీపీ తరుణ్ జ్యోషి నేతృత్వంలో డిసిపి యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విస్తరిస్తున్న డ్రగ్స్ ను అరికట్టడంలో వైద్య విద్యార్థులు, డాక్టర్లు పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ డ్రగ్స్ చెడుపరిణామాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తెలిసి తెలియక తమ బంగారు భవితను నాశనం చేసుకోవాలని స్పష్టం చేశారు.కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు విద్యార్థులచే డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై తేజశ్రీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోయా రాణీ,సీనియర్ సిబ్బంది సీఈఓ అజ్మల్ హస్సన్,సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, రఘువీరారెడ్డి, వినోద్ రెడ్డి, మల్లారెడ్డి,అనీల్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం: విప్ ఆది శ్రీనివాస్






**రాజన్న సిరిసిల్ల, జూన్ 26:**




డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల అవగాహన ప్రదర్శనలు, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల బారినపడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో డీ–అడిక్షన్ కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## కాప్రా సర్వే నంబర్ 11లో అక్రమ ఇండస్ట్రియల్ షెడ్ల కలకలం..!

- కస్టోడియన్ భూమిపై ల్యాండ్ మాఫియా కన్ను?
- నివాస ప్రాంతాల మధ్య భారీ షెడ్లు.. త్రీ-ఫేస్ మీటర్ల కేటాయింపుపై అనుమానాలు
- సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్

**కాప్రా జూన్26:**





కాప్రా మండల పరిధిలోని రెవెన్యూ కార్యాలయం పక్కన, సాకేత్ టవర్స్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 11 భూమిలో భారీ ఇండస్ట్రియల్ షెడ్ల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు నిర్మిస్తున్నారని, వాటికి విద్యుత్ శాఖ త్రీ–ఫేస్ కరెంట్ మీటర్లు మంజూరు చేయడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, దాదాపు మూడు ఎకరాల ఈ భూమి గతంలో కస్టోడియన్ ల్యాండ్‌గా రికార్డుల్లో ఉండేదని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఒకే భూమికి సంబంధించి వివిధ రకాల యాజమాన్య పత్రాలు చలామణిలో ఉన్నాయని, దీంతో భూ వివాదాలు మరింత సంక్లిష్టంగా మారాయని ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో నిర్మించిన ఇండస్ట్రియల్ షెడ్లను ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు తొలగించినప్పటికీ, అనంతరం మళ్లీ మరింత పెద్ద షెడ్లు నిర్మించారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల చిన్న చిన్న ఐరన్ క్యాబిన్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ నిర్మాణాలకు మున్సిపల్ లేదా రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే కమర్షియల్ అవసరాలకు ఉపయోగించే త్రీ–ఫేస్ విద్యుత్ మీటర్లు ఎలా మంజూరయ్యాయనే అంశంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖల అధికారుల పాత్రపై కూడా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసే ముందు భవన అనుమతులు, భూమి యాజమాన్యానికి సంబంధించిన పత్రాలను పరిశీలించాల్సి ఉండగా, ఈ కేసులో ఆ నిబంధనలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా మంజూరైన విద్యుత్ కనెక్షన్లను సమీక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పీర్ల పండుగ సందర్భంగా భక్తులకు షర్బత్ పంపిణీ కార్యక్రమం

### పాల్గొన్న జిల్లా మాజీ కోఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా

**యాలాల్ మండలం, జూన్,26 :**



పీర్ల పండుగ ముగింపు సందర్భంగా యాలాల్ మండల కేంద్రంలోని చావిడి పీర్ల వద్ద మజిత్ కమిటీ సభ్యులు భక్తులు,ప్రజలకు షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ జిల్లా కో–ఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా మాట్లాడుతూ,, పీర్ల పండుగ కుల,మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసే పండుగ అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రజలు భక్తిశ్రద్ధలతో, సామరస్య వాతావరణంలో పండుగను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.పీర్ల పండుగ సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సామాజిక ఐక్యతను చాటిచెప్పారని ఆయన తెలిపారు.చావిడి పీర్ల వద్ద నిర్వహించిన షర్బత్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కో–ఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా,వార్డు సభ్యులు జిలానీ, గడ్డం బస్వరాజ్, గంతల్ మైనుద్దీన్, డాక్టర్ రజాక్, గఫ్ఫార్ భాయ్, అక్రమ్, బాబా భాయ్, రజాక్ భాయ్, బుర్హాన్పూర్ నర్సిములు, ఆరిఫ్, ఉప్పలి నర్సిములు, డాన్ శీను తదితరులు పాల్గొన్నారు.

# మూసీ తొలి దశ పనులపై సీఎం రేవంత్ సమీక్ష





**హైదరాబాద్ జూన్26:**

రివర్‌బెడ్ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. భూసేకరణకు టీడీఆర్ లేదా పరిహారం.. నెక్లెస్ రోడ్‌లో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు హైదరాబాద్, జూన్ 26: ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి A. Revanth Reddy శుక్రవారం మూసీ రివర్‌ఫ్రంట్ తొలి దశ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రి Ponguleti Srinivasa Reddy, ఎంపీ Vem Narender Reddy, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి Jayesh Ranjan, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ Narsimha Reddy, ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ Gowthami, హెచ్ఎండీఏ కమిషనర్ Sarfaraz Ahmed, సీఎంఓ కార్యదర్శి Manik Raj, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మూసీ తొలి దశ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సూచించారు. భూసేకరణలో స్వచ్ఛందంగా భూములు ఇచ్చే వారికి టీడీఆర్ లేదా తగిన పరిహారం అందించాలని స్పష్టం చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ నుంచి తీసుకుంటున్న భూముల్లో ఉన్న నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలని నిర్ణయించారు. ప్రజలకు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కల్పించేందుకు నెక్లెస్ రోడ్‌లో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కేంద్రంలో ప్రాజెక్టులో చేపట్టబోయే అన్ని పనులను ప్రదర్శించడంతో పాటు ప్రజల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించే విధంగా రూపొందించాలని అధికారులకు సూచించారు.

# ఎస్సై ,కానిస్టేబుల్ అభ్యర్థులకు స్కాలర్షిప్ టెస్ట్

## అఖిల్ రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి.

**రాయపోల్,జూన్ 26:**

పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రోత్సాహం అందించేందుకు శ్రీధర్ సీసీఈ, అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు అఖిల్ రాజ్ ఫౌండేషన్ రాయపోల్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి తెలిపారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో ఎస్సై కానిస్టేబుల్ స్కాలర్షిప్ టెస్ట్ గోడపత్రికలు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నగదు బహుమతులతో పాటు కోచింగ్ ఫీజులో ప్రత్యేక రాయితీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థికి రూ.1 లక్ష, 21 మంది ప్రతిభావంతులకు నగదు బహుమతులు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఎంపికయ్యే వెయ్యి మంది అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. అదనంగా మెరిట్ ఆధారంగా కోచింగ్‌లో రాయితీలు, ఉచిత మెటీరియల్, ఇతర ప్రోత్సాహకాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ స్కాలర్‌షిప్ టెస్ట్ జూన్ 28 (ఆదివారం) ఉదయం 10:00 గంటలకు వాగ్దేవి జూనియర్ కళాశాల బజాజ షోరూం దగ్గర ముస్తాబాద్ రోడ్డు దుబ్బాక , స్నేహ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల రామాయంపేట కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థులు



సమీప పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసుకుని ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 7680887711, 7680887722 నెంబర్లకు సంప్రదించగలరన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు దాతర్ పల్లి భాస్కర్, రాంపల్లి సతీష్, పోతరాజు శ్రీనివాస్, ప్రవీణ్, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్న నియామకం

**జిడబ్లుఎంసి: 26 జూన్ :.**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం హెచ్ఎండీఏ (HMDA)లో కోర్ అర్బన్ రీజియన్ & మెట్రో రైల్ విభాగం జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి. వెంకన్న ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ నియమించింది. ఈ మేరకు ఇప్పటి వరకు జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ కమిషనర్ పదవికి అదనపు బాధ్యతలు (FAC) నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయి, ఐఏఎస్ గారిని ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిషనర్ టి. వెంకన్న త్వరలో బాధ్యతలు

## కొడంగల్‌లో ఘనంగా సాహు మహారాజ్ 152వ జయంతి

**కొడంగల్ మున్సిపల్ (మం)జూన్,26:**

కొడంగల్ టౌన్ బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో చత్రపతి సాహు మహారాజ్ 152వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.టౌన్ బీఎస్పీ పార్టీ అధ్యక్షులు కే. దస్తప్ప అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కొడంగల్ బీఎస్పీ పార్టీ ఇంచార్జులు యు. రమేష్ బాబు, కాశీనాథ్, కొడంగల్ తాలూకా బీఎస్పీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా బీఎస్పీ ఉపాధ్యక్షులు ఇశ్వప్ప తదితరులు పాల్గొన్నారు. కళాకారుడు బాలు పాటలు, మాటలతో అలరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చత్రపతి సాహు మహారాజ్ బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చిన పితామహుడని, వారు చదువుకోవాలని వసతి గృహాలు, బడులు కట్టించిన మహా మేధావి అని కొనియాడారు. స్త్రీలకు బాల్య వివాహాలు చేయరాదని చట్టాలు తీసుకొచ్చిన సంస్కర్త అని, కుల నిర్మూలన కోసం పోరాడిన వీరుడని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ పై చదువుల కోసం లండన్ వెళ్లేందుకు స్కాలర్‌షిప్ మంజూరు చేసిన మహనీయుడు సాహు మహారాజ్ అని ఆయన చారిత్రక నిర్ణయాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల మహిళలు, పెద్దలు, యువకులు,తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 28న చలో కొడంగల్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్), జూన్ 26:**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే చలో కొడంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర కన్వీనర్ గరిక సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల భారీ ర్యాలీకి మేడ్చల్ జిల్లా నుండి అధిక సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొనాలని సూచించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారంగా ఇచ్చిన హామీ అమలులో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం గురించి తెలంగాణ ప్రభుత్వం కె కేశవరావు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అధిక సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొనాలని, పిలుపునిచ్చారు.

# పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి.. రేపే పల్స్ పోలియో కార్యక్రమం

## "నిండు ప్రాణానికి రెండు చుక్కలు" జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్26:.**

మెదక్ జిల్లాలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు 75,496 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 457 పోలియో బూత్‌లు, మొబైల్, ట్రాన్సిట్ బృందాలతో కలిపి మొత్తం 872 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ పంపిణీ, పర్యవేక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి 0–5 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ నెల 28న గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో



ఏర్పాటు చేసిన బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన చిన్నారులకు వ్యాక్సిన్ అందజేస్తారని చెప్పారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.

## మున్సిపల్ 12 వ వర్డులో ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రాం

### పాల్గొన్న కొడంగల్ పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము



**కొడంగల్ మున్సిపల్, జూన్,26:**

కొడంగల్ పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో రెండవ రోజు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రామ్ 238 బూత్‌లో జరిగింది.పాల్గొన్న కొడంగల్ పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము బి.ఎల్.ఓ ఆఫీసర్ మహేశ్వరి,ఓటర్లు.

## జిల్లా డీసీసీ చైర్మన్ ధారా సింగ్ నాయక్, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ చేతుల మీదుగా...

### బిఎల్ఎ క్యాండిడేట్ లకు ఐడి కార్డులు అందజేత



**కొడంగల్, జూన్,26:**

ప్రభుత్వం చేపడుతున్న ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను పటిష్టంగా చేయాలని శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో వికారాబాద్ జిల్లా డీసీసీ చైర్మన్ ధారాసింగ్ నాయక్ కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ తో బిఎల్ఎ క్యాండిడేట్లకు ఐడి కార్డులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము హన్మ్య నాయక్ దస్తప్ప చంద్రనాయక్ హిరాసింగ్ ఆరిఫ్ తదిర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా కృషి చేయాలి: అమిత్ షా

**అమరావతి, జూన్ 26::.**

2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.

ఢిల్లీ నుంచి నిర్వహించిన నార్కో కోఆర్డినేషన్ వీడియో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలపై జీరో టోలరెన్స్ విధానం అమలు చేయాలని, హాట్‌స్పాట్లను గుర్తించి కింగ్‌పిన్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతికత ఆధారిత నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్‌ను విస్తరించాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రాలకు ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో EAGLE ప్రత్యేక మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు పోలీసులు, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, ఈగిల్, శునక దళాలతో సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళగిరిలోని ఈగిల్ ప్రధాన కార్యాలయం రాష్ట్ర మాదకద్రవ్య నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఎస్ఐల బదిలీ

**వరంగల్ జూన్26:.**

వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్.ఐ లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ప్రస్తుతం దామెర పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న అశోక్ అయినవోలు పోలీస్ స్టేషన్కు బదిలీ కాగా, అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు అలాట్మెంట్ అయినా ఎస్ఐ వీరభద్ర రావుకు దామెర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.

## రామంతపూర్ డివిజన్లో సర్ ఫారమ్ ల పంపిణీ అవగాహన

### కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్), జూన్ 26 :**

రామంతాపూర్ డివిజన్‌లో నిర్వహించిన సర్ (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్) అప్లికేషన్ ఫారమ్‌ల కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్ పాల్గొన్నారు. శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటరు నమోదు, చిరునామా మార్పులు ఇతర వివరాల నవీకరణకు సంబంధించిన సర్ అప్లికేషన్ ఫారమ్‌లను అందజేస్తూ అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును వినియోగించు కునేలా, ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా ప్రజలకు మార్గనిర్దేశనం చేస్తూ ప్రజాస్వామ్య బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి గౌరవం సర్ ఫారమ్‌ల ద్వారా ప్రతి అర్హుడికి ఓటరు గుర్తింపు ప్రజల హక్కుల కోసం నాయకుడు మొహమ్మద్ రఫీక్ నిరంతరం శ్రమిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగపుత్ర భాస్కర్ మహమ్మద్ షకీల్ గాయత్రి గౌడ్ అంబిక మహేష్ అన్న మొహమ్మద్ సాదిక్ మహమ్మదీ ఇషం స్వామి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



**నేరడిగొండ:** మండలంలోని రోల్ మామడ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవులతాండకు చెందిన నానక్ సింగ్ శుక్రవారం తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. నానక్ సింగ్ ఉదయం తన మేకలను మేపేందుకు గ్రామ శివారులోని పొలాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగల గుంపు అతడిపై దాడి చేయడంతో శరీరమంతా కుట్టి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించగా, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి నిర్మల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నానక్ సింగ్ అక్కడ చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

# రిలే నిరాహార దీక్షలకు అరె సంక్షేమ సంఘం సంఘీభావం




**కాగజ్నగర్:** కాగజ్నగర్లోని ఎస్పీఎం గేటు ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గ అరె సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ, బీజేపీ పెంచికల్పేట్ మండల అధ్యక్షుడు కుకట్కర్ రాజేశ్వర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జేఏసీ చేపట్టే భవిష్యత్ ఉద్యమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రిలే నిరాహార దీక్షలో గోలెం వెంకటేశం, దుండ్రా మధునయ్య పాల్గొన్నారు. వారికి మద్దతుగా బీఎంఎస్ నాయకులు సి.వెంకటేష్, మోర్లే నానాజీతో పాటు కార్మికులు నస్పూరి శ్రీనివాస్, కనకచారి, సురేందర్ యాదవ్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ఎస్ఐఆర్ సర్వేలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

## కాంగ్రెస్ నాయకులు ఈగ దామోదర్



**వరంగల్:** ఎస్ఐఆర్ సర్వేలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ నాయకులు ఈగ దామోదర్ అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని 11వ డివిజన్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్ఓ పి.సోమరాజు, బీఎల్ఏలు చి.రమేష్, పి.సత్యనారాయణలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలు సేకరించి ఫారాలు నింపించి స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలందరూ ఎస్ఐఆర్ సర్వేలో తప్పనిసరిగా పాల్గొని బీఎల్ఓలు, బీఎల్ఏలకు సహకరించాలని కోరారు. సర్వే సమయంలో వరుసగా మూడుసార్లు ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఇంటి వద్ద ఉండి తమ పూర్తి వివరాలను అందించి సర్వేను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్లో ఘనంగా మొహరం పండుగ

## యువకుల ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ



**తాండూర్:** తాండూర్ గ్రామంలో మొహరం పండగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పీరీల జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామ యువకులు జాతర ప్రాంగణంలో భక్తులకు షర్బత్ పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా యువకుల ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్యం బాబా, ఎండి సమీ, హబీబ్, అజార్, ముష్రఫ్ అలీ, ఎండి సాదిఖ్తో పాటు గ్రామ యువకులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీల వర్గీకరణ ఫలాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రామ్ మాదిగ




**ఆసిఫాబాద్ టౌన్:** ఎస్సీ వర్గీకరణ ద్వారా వచ్చే ఫలితాలను పూర్తి స్థాయిలో అందుకోవాలంటే మాదిగ, దాని ఉపకులాల విద్యార్థులంతా ఉన్నత చదువులు చదవాలని ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రామ్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణంలో 'గో టు విలేజ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలోని గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ నాయకులు పర్యటిస్తూ, విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరుస్తున్నారని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాల ప్రకారం.. అన్ని రకాల సమస్యల నిర్మూలనకు, అభివృద్ధికి చదువే మూలమని ఆయన స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న రాబోయే 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామంలో దండోరా గద్దెలను నిర్మించాలని, గద్దెలు లేని గ్రామాల్లో వెంటనే వాటిని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాదిగ, మాదిగ ఉపకులాలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, అలాగే మహాజన రాజ్యాధికార సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. జూలై 7వ తేదీన నిర్వహించే ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు అంతా కలిసి విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇప్ప నాగరాజు మాదిగ, మాటూరు జయరాజు మాదిగ, మండల నాయకులు కాంపెల్లి రాజలింగు మాదిగ, విద్యార్థి నాయకులు పస్తం బెన్నీ కృష్ణ, హస్తం మోహన్, ముస్లిం మైనారిటీ నాయకులు ఎండీ రఫీక్, బీసీ నాయకులు అదే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి, సత్యానికి ప్రతీక మొహర్రం

- మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్



**ఆసిఫాబాద్ టౌన్:** మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, మైనార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ మాట్లాడుతూ మొహర్రం అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది త్యాగానికి, సత్యానికి, ధర్మానికి ప్రతీక అని కొనియాడారు. లోకకళ్యాణం కోసం, సమాజంలో శాంతిని నెలకొల్పడం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. కులమతాలకు అతీతంగా, సోదరభావంతో అందరూ కలిసిమెలిసి జీవించడమే మొహర్రం పండుగ యొక్క అసలైన సందేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్, మైనారిటీ నాయకులు షేక్ షాకీర్, సాలం, నజీర్, అఖిల్, సర్దార్ , సాజీద్, స్థానిక ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మొహరం పండుగ వేడుకలు



**ఆసిఫాబాద్ :** త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొరం పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమై పదవ రోజుతో ముగిశాయి. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లోని జనకపుర్ లో మొహరం పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.మల్లిధ ముద్దులతో , బెల్లం షర్బత్ తో ,ప్రత్యేక వంటకాలతో డప్పు సప్పుల నడుమ వేలాది మంది భక్తులు మొహరం పండుగ విశిష్టతను జ గుర్తు తెచ్చుకుంటూ భక్తులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పీరీల మందిరం నుంచి పీరీలను వేలాది మంది భక్తులతో నుత్యాలు చేస్తూ ఉత్సవాలు జరుపుతూ పిరిలను ఊరేగింపు చేసి పీర్ల లోకానికి పంపించారు. అంతకుముందు పది రోజుల ముందు ప్రారంభమైన పండుగ వేడుకలు పది రోజులపాటు ఘనంగా సాగి పదవరోజు ముగిసాయి.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హసెన్, రఫీక్, సుధాకర్, బాబా, నజీర్, జావిద్, బాబా, సతీష్, కుమార్, నజీర్ తో పాటు వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత ఉపసంహరణపై నక్క మనోహర్ ఆగ్రహం

- వెంటనే భద్రత పునరుద్ధరించాలని డిమాండ్

**కాగజ్నగర్:** మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్కు కల్పించిన ఎక్స్–కేటగిరీ భద్రతను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 26 ఏళ్ల పాటు దేశానికి, ప్రజలకు సేవలందించిన మాజీ ఐపీఎస్ అధికారికి గత ప్రభుత్వాలు ప్రాణహాని దృష్ట్యా భద్రత కల్పించాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం భద్రతను తొలగించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. 2021లో ఐపీఎస్ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అప్పటి ప్రభుత్వం భద్రతను కొనసాగించిందని, ప్రస్తుతం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే కక్షసాధింపు ధోరణితో భద్రతను ఉపసంహరించుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఇంటెలిజెన్స్ శాఖ ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకుందో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని అన్నారు. వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్కు వెంటనే పూర్తి స్థాయి భద్రతను పునరుద్ధరించాలని, ఈ నిర్ణయానికి గల కారణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆయనకు ఏదైనా హాని జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రజా గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని, ప్రవీణ్ కుమార్కు తెలంగాణ ప్రజలు, గురుకుల విద్యార్థుల మద్దతు ఉందని పేర్కొన్నారు.




# మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

- ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్:** మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకునే పండుగ అని, ఇది దేశ మతసామరస్యానికి సజీవ ప్రతీక అని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో ప్రసిద్ధి చెందిన హస్సేన్–హుసేన్ దేవస్థానంలో నిర్వహించిన మొహర్రం వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో పండుగలను జరుపుకోవడం భారతీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అంతకుముందు దేవస్థానం కమిటీ సభ్యులు అతిథులకు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఉడుగు రాకేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతాప్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొల్లారం బాబన్న, జిల్లా జనరల్ సెక్రటరీ గౌలి సంజయ్ కుమార్, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు బెజ్జంకి అనిల్ కుమార్, ఏఎంసీ సభ్యులు పోశెట్టి, దివాకర్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు, మాజీ ఎంపీపీ రాజేశ్వర్, తలమడుగు యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయికిరణ్, రుయ్యాడి గ్రామ కాంగ్రెస్ నాయకులు సాంబశివుడు, ప్రవీణ్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# క్విక్ కామర్స్ రంగం కొత్త దశలోకి..

**వేగం నుంచి లాభదాయకత వైపు మార్పు**

**హైదరాబాద్, జూన్ 26 :** భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ రంగం ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోంది. ఇప్పటివరకు 10-15 నిమిషాల్లో డెలివరీ అందించడం ప్రధాన లక్ష్యంగా ఉన్న ఈ రంగం, ఇప్పుడు లాభదాయకత, యూనిట్ ఎకనామిక్స్, ఆపరేషనల్ సామర్థ్యం వైపు దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో ఎటర్నల్ (మాజీ జొమాటో)కు చెందిన బ్లింకిట్ సుమారు 45-50 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 200కు పైగా నగరాల్లో 2,243 డార్క్ స్టోర్ల నెట్‌వర్క్‌తో ఇది బలమైన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలు చెరో 20-25 శాతం మార్కెట్ వాటాతో పోటీని కొనసాగిస్తున్నాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ నాటికి 1,143 డార్క్ స్టోర్లను, జెప్టో 1,139 డార్క్ స్టోర్లను నిర్వహిస్తున్నాయి. దీంతో ఈ రంగంలో పోటీ మరింత తీవ్రమవుతోంది. ఇదే సమయంలో ఫ్లిప్‌కార్ట్ తన "ఫ్లిప్‌కార్ట్ మినిట్స్" సేవను వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే 1,000 మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయగా, 180 నగరాల్లో 1,500 డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు అమెజాన్ కూడా "అమెజాన్ నౌ" సేవను 300 నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమెజాన్ ఇప్పటికే భారత మార్కెట్‌లో ప్రకటించిన 48 బిలియన్ డాలర్ల పెట్టుబడిలో భాగంగా ఈ క్విక్ కామర్స్ విభాగాన్ని కీలకంగా తీసుకుంటోంది. విశ్లేషకుల అభిప్రాయం




ప్రకారం, ఇప్పుడు కంపెనీల ప్రధాన లక్ష్యం కేవలం వేగంగా డెలివరీ చేయడం మాత్రమే కాకుండా, వినియోగదారులను నిలుపుకోవడం, లాభాలు సాధించడం, సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం. అందుకే కంపెనీలు నిత్యావసరాలతో పాటు ఎలక్ట్రానిక్స్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల వరకు తమ సేవలను విస్తరిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, భారత క్విక్ కామర్స్ రంగం వేగం ఆధారిత పోటీ నుంచి స్థిరమైన వ్యాపార నమూనాల వైపు మారుతోంది. ఇది వినియోగదారులకు మరింత సౌకర్యాన్ని అందించనున్నప్పటికీ, కంపెనీలకు మాత్రం పెద్ద సవాలుగా మారనుంది.



## బంగారం ధరలు స్థిరం

**హైదరాబాద్, జూన్ 26 :** దేశీయంగా బంగారం ధరలు శుక్రవారం స్థిరంగా కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఉదయం 6 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,320గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,29,540గా ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,05,990 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పంగా తగ్గుదల నమోదు చేశాయి. కిలో వెండి ధర రూ.100 తగ్గి ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో రూ.2,34,900గా కొనసాగుతోంది. మార్కెట్ నిపుణుల ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ మారకపు విలువ, గ్లోబల్ డిమాండ్ మార్పుల ఆధారంగా బంగారం ధరలు స్వల్పంగా స్థిరత్వం చూపిస్తున్నాయని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## ఐఫోన్ 18 ధరలపై వినియోగదారులకు ఊరట..




**హైదరాబాద్, జూన్ 26 :** ప్రతి ఏడాది కొత్త ఐఫోన్ విడుదలకు ముందు ధరల పెంపుపై జరుగుతున్న ఊహాగానాలు ఈసారి కూడా టెక్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. అయితే తాజా అంతర్జాతీయ నివేదికలు యాపిల్ అభిమానులకు కొంత ఊరటనిచ్చే సమాచారం వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మెమరీ చిప్‌లు, స్టోరేజ్ భాగాల తయారీ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఐఫోన్ ధరలు భారీగా పెరగవచ్చని గతంలో అంచనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఐఫోన్ 18 ప్రో ధర ఐఫోన్ 17 ప్రోతో పోలిస్తే సుమారు 200 డాలర్లు (సుమారు రూ.16,500) వరకు పెరగవచ్చని టెక్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జేపీ మోర్గాన్ తాజా విశ్లేషణ ప్రకారం ఈ పెంపు కేవలం 50 డాలర్లు (సుమారు రూ.4,100) మేర మాత్రమే ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది వినియోగదారులకు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు. తయారీ ఖర్చులను తగ్గించేందుకు యాపిల్ కీలక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ప్రస్తుతం ఉపయోగిస్తున్న క్వాల్‌కామ్ మోడెమ్‌ల స్థానంలో స్వంతంగా అభివృద్ధి చేసిన 'యాపిల్ జ-సిరీస్' మోడెమ్‌లను ఐఫోన్ 18 సిరీస్‌లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీని ద్వారా ఉత్పత్తి ఖర్చులు కొంతవరకు తగ్గవచ్చని అంచనా. భారత మార్కెట్‌లో ప్రభావం విషయానికి వస్తే, గత ఐఫోన్ 17 ప్రో సుమారు రూ.1.34 లక్షల ప్రారంభ ధరతో విడుదలైంది. అదే స్థాయిలో స్వల్ప ధర పెంపు మాత్రమే జరిగితే, భారత వినియోగదారులపై పెద్ద భారం పడే అవకాశం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

## బంగీ సంస్థలో భారీ లేఆఫ్స్




**హైదరాబాద్, జూన్ 26 :** ప్రముఖ అంతర్జాతీయ గేమ్ డెవలప్‌మెంట్ సంస్థ బంగీ భారీ ఉద్యోగాల కోతలను ప్రకటించింది. 2022లో సోనీ సుమారు 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30,000 కోట్లు) వెచ్చించి ఈ స్టూడియోను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు, వ్యయ నియంత్రణ, అంతర్గత పునర్వ్యవస్థీకరణ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ లేఆఫ్స్ ప్రభావం ప్రధానంగా 'డెస్టినీ' గేమ్ విభాగంతో పాటు 'మారథాన్' ప్రాజెక్ట్ టీమ్‌పై పడింది. 'డెస్టినీ 2' గేమ్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని కంపెనీ అధికారిక ప్రకటనలో పేర్కొంది. గేమ్‌కు సంబంధించిన చివరి కంటెంట్ అప్‌డేట్ కూడా పూర్తయిందని, ప్రస్తుత పరిస్థితుల్లో భారీ సిబ్బందిని కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కాదని సంస్థ స్పష్టం చేసింది. ప్లేస్టేషన్ స్టూడియోస్ హెడ్ హెర్మెన్ హల్స్ట్ కూడా ఈ నిర్ణయం బాధాకరమైనదేనని పేర్కొంటూ, దీర్ఘకాలిక వ్యాపార స్థిరత్వం కోసం తప్పనిసరి చర్యగా అభివర్ణించారు. పదేళ్లకు పైగా గేమర్లను ఆకట్టుకున్న 'డెస్టినీ 2' లైవ్ సర్వీస్ అప్‌డేట్స్ ఇకపై నిలిచిపోనున్నట్లు తెలుస్తోంది. 'డెస్టినీ 3' ప్రాజెక్ట్ ప్రస్తుతానికి పరిశీలనలో లేదని సమాచారం. ఈ ఏడాది ప్రారంభంలో విడుదలైన 'మారథాన్' గేమ్ కూడా ఆశించిన విజయాన్ని సాధించలేకపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ గేమింగ్ పరిశ్రమలో పెరుగుతున్న అభివృద్ధి ఖర్చులు, మారుతున్న వినియోగదారుల అభిరుచులు పెద్ద స్టూడియోలకు సవాళ్లుగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే బంగీ మరోసారి ఉద్యోగాల కోతలను ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఉద్యోగాలు కోల్పోయిన వారికి సోనీ గ్రూప్‌లోని ఇతర విభాగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని సంస్థ భరోసా ఇచ్చింది.

## ఆవిష్కరణకు సిద్ధమైన గెలాక్సీ ఏ27 5జీ స్మార్ట్‌ఫోన్





**హైదరాబాద్, జూన్ 26 :** శాంసంగ్ తన కొత్త గెలాక్సీ ఏ27 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ప్రపంచవ్యాప్తంగా ఆవిష్కరించింది. పెద్ద తెర, ఆధునిక ఏఐ ఫీచర్లు, ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ సపోర్ట్‌తో ఈ ఫోన్‌ను కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. జులై 3 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి. అయితే ధరను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈ ఫోన్‌లో 6.7 అంగుళాల సూపర్ అమోలెడ్ ఇన్‌ఫినిటీ-ూ డిస్‌ప్లేను అందించారు. 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌తో స్క్రోలింగ్, వీడియో వీక్షణ, గేమింగ్ అనుభవం మరింత స్మూత్‌గా ఉంటుందని శాంసంగ్ తెలిపింది. పనితీరు కోసం స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 ప్రాసెసర్‌ను ఇందులో వినియోగించారు. ఏఐ ఫీచర్లలో సర్కిల్ టు సెర్చ్, ఆబ్జెక్ట్ ఎరేజర్, వాయిస్ ట్రాన్స్‌క్రిప్షన్, గూగుల్ జెమినీ, పర్‌ప్లెక్సిటీ, బిక్స్‌బీ వంటి సేవలను పొందుపరిచారు. ఒకే ఫోటోలోని పలు అంశాలను ఒకేసారి గుర్తించి సెర్చ్ చేసే సదుపాయం కూడా ఇందులో ఉంది. వాయిస్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫీచర్ 22 భాషలను సపోర్ట్ చేస్తుంది. ఈ ఫోన్‌లో 5,000 ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు 25 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ఉంది. భద్రత కోసం శాంసంగ్ నాక్స్, నాక్స్ వాల్ట్ సెక్యూరిటీ వ్యవస్థలను అందించింది. అలాగే ఆరు ఆండ్రాయిడ్ అప్‌డేట్లు, ఆరేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్లు అందిస్తామని కంపెనీ ప్రకటించింది. బ్లాక్, బ్లూ, లైట్ గ్రీన్, లైట్ పింక్ రంగుల్లో ఈ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి రానుంది.

## భారత్-యూకే ఫ్రీ ట్రేడ్ ఒప్పందం అమల్లోకి..

**లగ్జరీ వస్తువుల ధరలు తగ్గే అవకాశం**



**హైదరాబాద్, జూన్ 26 :** జూలై 15 నుంచి భారత్--యూకే ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ అధికారికంగా అమలులోకి రానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ చారిత్రాత్మక ఒప్పందం వల్ల రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడటమే కాకుండా, యూకే నుంచి దిగుమతి అయ్యే అనేక ప్రీమియం ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం లగ్జరీ కార్లు, విదేశీ పానీయాలు, కాస్మెటిక్స్, పర్సనల్ కేర్ ఉత్పత్తులపై ఉన్న దిగుమతి సుంకాలు దశలవారీగా తగ్గనున్నాయి. ముఖ్యంగా స్కాచ్ విస్కీపై ఉన్న 150 శాతం టారిఫ్‌ను 75 శాతానికి తగ్గించనున్నారు. అలాగే బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లపై ఉన్న 110 శాతం సుంకం 30 శాతానికి తగ్గే అవకాశం ఉంది. వచ్చే ఐదేళ్లలో ఈ సుంకాలు మరింత తగ్గి సుమారు 10 శాతానికి చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మార్పుల వల్ల రేంజ్ రోవర్ వంటి ప్రీమియం కార్ల ధరలు ఇప్పటికే తగ్గుముఖం పట్టే సంకేతాలు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఆటోమొబైల్స్, ఆల్కహాల్ మాత్రమే కాకుండా చాక్లెట్లు, స్వీట్ బిస్కెట్లు, సాఫ్ట్ డ్రింక్స్, సాల్మన్ ఫిష్, కొన్ని వైద్య పరికరాలు వంటి ఉత్పత్తులు కూడా తక్కువ ధరలకు అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల భారత వినియోగదారులకు అంతర్జాతీయ బ్రాండ్లు మరింత చేరువవుతాయని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మొత్తంగా ఈ ఒప్పందం దిగుమతులను సులభతరం చేసి, వినియోగదారులకు తక్కువ ధరలో నాణ్యమైన విదేశీ ఉత్పత్తులను అందించడంలో కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## స్మార్ట్ టీవీల వాడకంతో విద్యుత్ బిల్లు

**హైదరాబాద్, జూన్ 26 :** సాధారణంగా ఇంట్లో విద్యుత్ బిల్లు ఎక్కువగా రావడానికి ఏసీ, కూలర్ లేదా ఫ్రిజ్ కారణమని చాలా మంది భావిస్తారు. కానీ ఇప్పుడు ఇంట్లో ఎక్కువగా ఉపయోగిస్తున్న స్మార్ట్ టీవీలు కూడా కరెంట్ బిల్లును గణనీయంగా పెంచుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటి టీవీలు కేవలం టీవీ కార్యక్రమాలు చూడటానికే పరిమితం కాకుండా, ఓటీటీ వినోదం, ఇంటర్నెట్ వినియోగం, గేమింగ్ వంటి అనేక పనులకు ఉపయోగపడుతున్నాయి. దీంతో టీవీలు రోజంతా ఎక్కువసేపు పనిచేస్తూ విద్యుత్ వినియోగాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా టీవీ పరిమాణం ఎంత పెద్దదైతే, అంత ఎక్కువ విద్యుత్ ఖర్చవుతుందని తెలుస్తోంది.

### బిల్లు పెరగడానికి కారణాలు

టీవీలలో ఇప్పుడు గేమింగ్, అధిక నాణ్యత గల వీడియో ప్రసారం, ఇంటర్నెట్ ఆధారిత సేవలు వంటి ఫీచర్లు ఎక్కువగా ఉండటం వల్ల ప్రాసెసర్‌పై భారం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది.

అలాగే ప్రకాశం ఎక్కువగా ఉంచడం వల్ల తెర వెనుక వెలుతురు వ్యవస్థ ఎక్కువ శక్తిని వినియోగిస్తుంది. చాలామంది ఉపయోగించకపోయినా టీవీని ఆన్‌లోనే ఉంచడం కూడా బిల్లును పెంచుతోంది.

## డాలర్ ఆధిపత్యానికి సవాల్

**చమురు చెల్లింపుల్లో ఇరాన్ కీలక సంకేతాలు**

**హైదరాబాద్, జూన్ 26 :** అమెరికా ఆంక్షల సడలింపు, ఇరాన్ ఆస్తుల విడుదల, చమురు ఎగుమతుల పునరుద్ధరణపై చర్చలు కొనసాగుతున్న వేళ ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్నాసర్ హెమ్మతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చర్చనీయాంశంగా మారాయి. డాలర్ ఆధారిత చమురు లావాదేవీలకు ఇకపై పూర్తిగా కట్టుబడి ఉండబోమని, తమకు అనుకూలమైన ఏ కరెన్సీలోనైనా చెల్లింపులను స్వీకరించే స్వేచ్ఛ ఇరాన్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ ఆస్తుల విడుదల, ఆంక్షల సడలింపు అంశాలపై అమెరికా--ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదే నేపథ్యంలో భారతదేశానికి కూడా ఈ పరిణామం ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. గతంలో తక్కువ రవాణా దూరం కారణంగా ఇరాన్ చమురు భారత్‌కు ఖర్చు పరంగా అనుకూలంగా ఉండేది. అలాగే ఇతర సరఫరాదారులతో పోలిస్తే 60 నుంచి 90 రోజుల వరకు ఎక్కువ క్రెడిట్ సౌకర్యం ఇరాన్ అందించేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ చమురు మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి మధ్య ఈ తాజా సంకేతాలు డాలర్ ఆధిపత్యంపై మరోసారి చర్చను ప్రారంభించాయి.



చురకలు






# ఐర్లాండ్‌తో తొలి టీ20కు సిద్ధమైన టీమిండియా

## నెట్స్‌లో మెరిసిన వైభవ్ సూర్యవంశీలిలి

**బెల్‌ఫాస్ట్, జూన్ 26 :** ఐర్లాండ్‌తో ఇవాళ జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ నెట్స్‌లో చేసిన ప్రాక్టీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుది జట్టులో అతనికి అవకాశం దక్కుతుందా లేదా అన్నది ఇంకా స్పష్టత రాకపోయినా, తొలిసారి టీమిండియా సీనియర్ ఆటగాళ్లతో కలిసి అతను తీవ్రంగా సాధన చేశాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో అగ్రశ్రేణి బౌలర్లపై దూకుడుగా ఆడిన వైభవ్, అదే ఆత్మవిశ్వాసంతో నెట్స్‌లోనూ భారీ షాట్లు కొట్టాడు. బౌలర్లను భయపడకుండా ఎదుర్కొంటూ వివిధ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఈ ప్రాక్టీస్ వీడియోను బీసీసీఐ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేయగా, ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యువ ఓపెనర్ ప్రదర్శన టీమిండియా బ్యాటింగ్ లైనప్‌కు కొత్త ఉత్సాహం తెచ్చేలా కనిపిస్తోంది.




# ఐరిష్ బోర్డు నిర్వాకంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహం

**బెల్ఫాస్ట్, జూన్ 26 :** భారత్, ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బెల్ఫాస్ట్ చేరుకున్న టీమిండియాకు తొలి రోజే అసౌకర్యకర పరిస్థితి ఎదురైంది. ప్రాక్టీస్ కోసం కేటాయించిన మైదానంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ సమయంలో అవసరమైన సైట్ స్క్రీన్ లేకపోవడం వల్ల సెషన్‌కు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. టీ20 క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌కు బంతి స్పష్టంగా కనిపించేందుకు సైట్ స్క్రీన్ అత్యంత కీలకం. ఈ అంశాన్ని గుర్తించిన భారత సపోర్ట్ స్టాఫ్ వెంటనే ఐర్లాండ్ క్రికెట్ బోర్డుకు సమాచారం ఇచ్చింది. అనంతరం ఐరిష్ అధికారులు స్పందించి తక్షణమే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదే సిరీస్‌తో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నెట్స్ సెషన్‌లో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ వంటి బౌలర్లను ఎదుర్కొని అతను ఆకట్టుకున్నట్లు సమాచారం. అయితే తుది జట్టులో వైభవ్‌కు అవకాశం దక్కే విషయంపై ఇంకా స్పష్టత లేదు. జట్టులో ఇప్పటికే ఓపెనింగ్ స్థానాలకు తీవ్ర పోటీ ఉండటంతో మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం మ్యాచ్‌కు ముందు తీసుకునే అవకాశం ఉంది.

# వైభవ్ సూర్యవంశీపై ప్రపంచ దృష్టి..

## అశ్విన్ కీలక సూచన




**బెల్ఫాస్ట్, జూన్ 26 :** భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది. భారత జట్టులో ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన ఈ యువ ఆటగాడు, రాబోయే ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ సిరీస్‌ల నేపథ్యంలో ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారాడు. ఈ నేపథ్యంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వైభవ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్న వయసులోనే అతనిపై భారీ అంచనాలు పెరగడం సహజమని, అయితే ఆ ఒత్తిడిని పక్కన పెట్టి తన సహజ ఆటను ఆస్వాదించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడేటప్పుడు వచ్చే ఒత్తిడిని తగ్గించుకుని, తాను చిన్నప్పుడు వీధుల్లో క్రికెట్ ఆడినట్లే స్వేచ్ఛగా ఆడాలని అశ్విన్ అభిప్రాయపడ్డారు. వైభవ్ ఇటీవల ఇండియా ఏ జట్టు తరపున శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయాన్ని అశ్విన్ ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో అతను జట్టు విజయానికి కీలకంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడినట్లు గుర్తుచేశారు. అతని బ్యాటింగ్‌లో ఉన్న దూకుడుతో పాటు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడగల సామర్థ్యం అతన్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని తెలిపారు. మొత్తానికి వైభవ్ సూర్యవంశీపై ఉన్న అంచనాలు భారీగా ఉన్నప్పటికీ, అతని సహజ ఆటే అతని పెద్ద బలం అవుతుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# లీగ్ దశలో ఒక్క గోల్ ఇవ్వలే..

## ఆరో జట్టుగా మెక్సికో రికార్డు..!





ఆద్యంతం వేడుకలా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో మెక్సికో(వీవఇఅషీ) చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో మూడుకు మూడు మ్యాచుల్లో విజయాలతో నాకౌట్‌కు వెళ్లిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని ఒక్కగోల్ కూడా కొట్టనివ్వలే. తద్వారా.. లీగ్ దశలో శత్రు జట్టుకు ఒక్క గోల్ సమర్పించుకోని జట్టుగా రికార్డు పుస్తకాల్లో నిలిచింది. మొత్తంగా సాకర్ వరల్డ్‌కప్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆరో జట్టుగా మెక్సికో గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో రికార్డులు బద్దలవుతున్నాయి. లీగ్ దశ 33వ మ్యాచ్‌లోనే వంద గోల్స్ నమోదవ్వడం ఓ రికార్డైతే.. ఆతిథ్య మెక్సికో ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండానే నాకౌట్ చేరింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో చిత్తు చేసి.. హ్యాట్రిక్ విజయాలతో ఔరా అనిపించిన మెక్సికో వరల్డ్‌కప్ చరిత్రలో అరుదైన ఫీట్ సొంతం చేసుకుంది. ఇదివరకూ నెదర్లాండ్స్(1974), బ్రెజిల్(1986), ఇటలీ(1990), అర్జెంటీనా(1998), ఉరుగ్వే(2018).. ఈ ఐదు జట్లు మాత్రమే లీగ్ దశలో ప్రత్యర్థిని ఒక్క గోల్ కొట్టనివ్వలేదు. గ్రూప్ ఏలోని మెక్సికో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 0-2తో ఓడించింది. రెండో గేమ్‌లో దక్షిణ కొరియాను వణికిస్తూ 1-0 విజయం సాధించింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో ఓడించిన మెక్సికో నాకౌట్ బెర్తు పట్టేసింది. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది మెక్సికో. 32వ రౌండ్ తొలి మ్యాచ్‌లో మంగళవారం ఎస్తాడియో అజ్టెకాను ఎడ్సన్ అవ్వరెజ్ సారథ్యంలోని మెక్సికో ఢీకొట్టనుంది.

# 452 పరుగులకు డిక్లేర్

## శతకాలతో తుక్కు రేపిన జురెల్, సాయి సుదర్శన్..



ఇండియా 'ఎ' వర్సెస్ శ్రీలంక 'ఎ' మధ్య శ్రీలంకలోని గాలే వేదికగా జరుగుతున్న మొదటి అనధికారిక టెస్ట్ మ్యాచ్ రెండవ రోజు ఆట ముగిసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా 'ఎ' జట్టు, సాయి సుదర్శన్ మరియు కెప్టెన్ ధ్రువ్ జురెల్ ల అద్భుత శతకాల సాయంతో తన మొదటి ఇన్నింగ్స్‌ను 111.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 452 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మొదటి రోజు ఓపెనర్ సాయి సుదర్శన్ 19 ఫోర్లతో 132 పరుగులు చేసి జట్టుకు మంచి పునాది వేయగా, దేవదత్ పడిక్కల్ (12), రుతురాజ్ గైక్వాడ్ (22) నిరాశపరిచారు. అయితే.. మ్యాచ్ కు వర్షం అంతరాయం కల్పించినా.. కెప్టెన్ ధ్రువ్ జురెల్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి 215 బంతుల్లో 141 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతనికి తోడుగా షేక్ రషీద్ 63 పరుగులు చేసి రెండో రోజు ప్రారంభంలోనే అవుట్ అయినప్పటికీ, వీరిద్దరూ ఐదో వికెట్‌కు 116 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ సిరీస్‌కు ముందు భారత్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన ట్రై-సిరీస్‌ను గెలుచుకున్న ఉత్సాహంతో ఇండియా 'ఎ' బరిలోకి దిగింది. ఆ ట్రై-సిరీస్ ఫైనల్లో 29 బంతుల్లో 94 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించిన వైభవ్ సూర్యవంశీ, ప్రస్తుతం సీనియర్ జట్టుతో కలిసి ఐర్లాండ్ పర్యటనలో (టీ20 అరంగేట్రం చేసే అవకాశం) ఉన్నందున ఈ టెస్ట్ సిరీస్‌కు అందుబాటులో లేడు. ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం భారతదేశంలో అందుబాటులో లేదు. భారత జట్టులో సాయి సుదర్శన్, ఆయుష్ పాండే, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్), షేక్ రషీద్, హర్ష్ దూబే, సారాంశ్ జైన్, అన్షుల్ కంబోజ్, యష్ ఠాకూర్, ఆకిబ్ నబీ దార్ ఉన్నారు. శ్రీలంక జట్టులో పవంత వీరసింఘే, నిరోషన్ డిక్వెల్లా, నువనిందు ఫెర్నాండో, అషేన్ బండార, సహన్ అరాచ్చిగే (కెప్టెన్), రవిందు ఫెర్నాండో, అంజలా బండార, కవిందు పతిరత్నే, దులజ్ సముదిత, చామిక గుణశేఖర, దిలుమ్ సుదీర ఆడుతున్నారు.

# క్రికెట్ దిగ్గజాలకు గౌరవ హోదాలు

## దేశ సేవలోనూ ప్రత్యేక గుర్తింపు

**న్యూఢిల్లీ, జూన్ 26 :** మైదానంలో ప్రత్యర్థులను చిత్తు చేసి భారత క్రికెట్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన పలువురు దిగ్గజ ఆటగాళ్లు, దేశ సేవలోనూ తమదైన ముద్ర వేశారు. బ్యాట్, బాల్‌తో కోట్లాది అభిమానులను సంపాదించిన ఈ స్టార్ క్రికెటర్లకు భారత సైన్యం, పోలీస్ శాఖలు గౌరవ హోదాలు ప్రదానం చేసి గౌరవించింది. క్రమశిక్షణ, దేశభక్తి, సమాజ సేవకు గుర్తింపుగా ఈ హోదాలను అందుకున్న వీరు, క్రీడలతో పాటు సేవా రంగంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా లభించింది. ధోనీ తన విధుల్లో భాగంగా సైనికులతో కలిసి శిక్షణలో పాల్గొనడం ప్రత్యేకతగా నిలిచింది. 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్‌కు కూడా భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ ర్యాంక్ అందించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ గౌరవ హోదాను ప్రదానం చేసింది.

ఇక భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తెలంగాణ పోలీస్ శాఖ డీఎస్పీ గౌరవ హోదా ఇచ్చింది. అలాగే మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పంజాబ్ పోలీస్‌లో డీఎస్పీ హోదాలు లభించాయి. క్రీడల్లో విశేష సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వాలు, రక్షణ దళాలు, పోలీస్ శాఖలు ఇలాంటి గౌరవ హోదాలు ప్రదానం చేస్తుంటాయి. మైదానంలో విజయాలతో దేశానికి కీర్తి తీసుకురావడమే కాకుండా, దేశ సేవకు ప్రతీకలైన గౌరవ హోదాలను అందుకోవడం ద్వారా ఈ క్రికెటర్లు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆటలో క్రమశిక్షణ, జీవితంలో దేశభక్తి కలిసినప్పుడు ఎంతటి గౌరవం దక్కుతుందో ఈ దిగ్గజాల ప్రయాణం మరోసారి చాటి చెబుతోంది.





# అమెరికాతో థ్రిల్లర్..

## ఆఖరి నిమిషంలో నెగ్గిన టర్కీ

**లాస్ ఏంజిల్స్:** ఫిఫా వరల్డ్‌కప్ లో టర్కీ తొలి విజయాన్ని నమోదు చేసింది. వాస్తవానికి టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన ఆ జట్టు .. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో హోస్ట్ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో నెగ్గింది. గ్రూప్ డీ మ్యాచ్‌లో మొత్తం అయిదు గోల్స్ నమోదు అయ్యాయి. ఈ మ్యాచ్‌లో అమెరికా ఓడినా.. ఆ గ్రూపులో మాత్రం ఆ దేశమే అగ్రస్థానంలో ఉన్నది. ఆట ప్రారంభమైన మూడు నిమిషాలకే అమెరికా ప్లేయర్ ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టాడు. డీప్ కార్నర్ నుంచి సెబాస్టియన్ అందించిన పాస్‌ను లెఫ్ట్ ఫూట్‌తో ట్రస్టీ గోల్‌గా మలిచాడు. టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినా.. అమెరికాతో మ్యాచ్‌లో మాత్రం టర్కీ పట్టుదలతో ఆడింది. ఇక టర్కీ ప్లేయర్ గులేర్ 10వ నిమిషంలో ఆ జట్టుకు తొలి గోల్ అందించాడు. అరగంట ఆట ముగిశాక.. టర్కీ ప్లేయర్ బారిస్ యిల్మాజ్ మరో గోల్ చేశాడు. దీంతో టర్కీ లీడింగ్‌లోకి వెళ్లింది. రెండో హాఫ్ 49వ నిమిషంలో అమెరికా ప్లేయర్ బెర్‌హాల్టర్ గోల్ చేసి ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపాడు. దాదాపు ఆట ముగిసే సమయం వరకు రెండు జట్లు 2-2 గోల్స్ తేడాతో సమంగా పోరాడాయి. కానీ 98వ నిమిషంలో టర్కీ ప్లేయర్ అందర్నీ స్టన్ చేశాడు. కాన్ అయాన్ గోల్ చేయడంతో కీలకమైన మూడు పాయింట్లు టర్కీ ఖాతాలోకి వెళ్లాయి. అమెరికా జట్టు ఈ టోర్నీలో చరిత్ర సృష్టిస్తోంది. ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఈవెంట్‌లో ఇప్పటికే 8 గోల్స్ చేసింది. గతంలో 1930, 2002లో అత్యధికంగా ఏడు గోల్స్ మాత్రమే చేసింది.

చురకలు






## హిట్ కోసం ఎదురుచూస్తున్న

# కేతిక శర్మ

టాలీవుడ్‌లో యువ నటి కేతిక శర్మ ఇప్పటికీ తన తొలి భారీ విజయాన్ని కోసం ఎదురుచూస్తున్నారు. రొమాంటిక్ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే గ్లామర్ గర్ల్‌గా గుర్తింపు సంపాదించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. ఆకాష్ పూరి సరసన నటించిన తొలి సినిమా ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకువచ్చినప్పటికీ వసూళ్ల పరంగా పెద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో నటించిన 'లక్ష్య' కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగా' సినిమా కూడా డిజాస్టర్‌గా నిలవడంతో వరుసగా అవకాశాలు ఆశించినంతగా రాలేదు. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బ్రో' చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఆ సినిమా కూడా కేతిక కెరీర్‌కు పెద్ద ఊతం ఇవ్వలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేతిక శర్మ చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన క్రేజ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే మంచి స్క్రిప్ట్‌తో మళ్లీ వెండితెరపై బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలనే ఆశతో ఆమె ఎదురుచూస్తున్నారు.



# ప్రస్తుతం రిలేషన్‌షిప్‌లో లేను

## శృతి హాసన్ క్లారిటీ..

సినీ నటి శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ప్రేమ వ్యవహారంపై వస్తున్న ప్రచారాలకు తాజాగా ఆమె స్వయంగా స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం ఎవరితోనైనా ప్రేమ సంబంధంలో ఉన్నారా అని ప్రశ్నించగా, తాను ప్రస్తుతం ఎవరితోనూ ఎలాంటి ప్రేమ సంబంధంలో లేనని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న వార్తలకు తెరపడింది. మరో అభిమాని నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని ప్రశ్నించగా, చిన్నారుల మానసిక వైద్యురాలిగా మారాలని తనకు ఆసక్తి ఉండేదని శృతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఈ సమాధానం కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో వరుస విజయాలతో గుర్తింపు తెచ్చుకున్న శృతి హాసన్ ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తక్కువ చిత్రాలు చేస్తున్నప్పటికీ అభిమానులతో మాత్రం సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం మమేకమవుతున్నారు. ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించిన శృతి హాసన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఆమె నటించనున్న 'సలార్--2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు స్వయంగా సమాధానం ఇవ్వడంతో శృతి హాసన్ వ్యాఖ్యలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.




# నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు

## సునీత మరోసారి స్పష్టీకరణ..

గాయని సునీత ఇటీవల చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీయగా, వాటిపై మరోసారి ఆమె స్పందిస్తూ తన ఉద్దేశాన్ని వివరించారు. 'నా శరీరం.. నా హక్కు' అనే అంశంపై తాను చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. మహిళల హక్కులను తాను ఎప్పుడూ గౌరవిస్తానని, మహిళలపై జరిగే అన్యాయాలకు ఎప్పటికీ మద్దతు ఇవ్వనని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సునీత, మహిళలకు తమకు నచ్చిన దుస్తులు ధరించే పూర్తి హక్కు ఉన్నప్పటికీ, సమాజంలోని వాస్తవ పరిస్థితులను కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో గాయని చిన్మయి శ్రీపాద స్పందిస్తూ, సునీత పట్ల తనకు గౌరవం ఉన్నప్పటికీ, అలాంటి వ్యాఖ్యలు మహిళల హక్కులకు వ్యతిరేకంగా అర్థమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళల శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు పూర్తిగా వారిదేనని ఆమె పేర్కొన్నారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన సునీత, చిన్మయిపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. 'నా శరీరం.. నా ఇష్టం' అనే భావన అర్థం తనకు పూర్తిగా తెలుసని, ప్రతి వ్యక్తికీ తన శరీరంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉంటుందని చెప్పారు. అయితే తాను చెప్పదలచుకున్నది సమాజంలో ఇప్పటికీ ఉన్న వాస్తవ పరిస్థితుల గురించేనని, మహిళలపై వేధింపులు లేదా అన్యాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే వారికి వ్యతిరేకంగా నిలబడే వారిలో తాను కూడా ఉంటానని పేర్కొన్నారు. ఫెమినిజం గురించి కూడా సునీత తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళలు, పురుషులు పరస్పరం గౌరవించుకోవడం, అవకాశాల్లో సమానత్వం ఉండటమే తన దృష్టిలో ఫెమినిజం అని తెలిపారు. మహిళలను తక్కువగా చూడడం, వారి అభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడాన్ని తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. సమానత్వం అంటే అందరూ ఒకేలా ఉండడం కాదని, భిన్న లక్షణాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, సమాన అవకాశాలు ఉండాలన్నదే తన అభిప్రాయమని వివరించారు. మహిళల హక్కులు, సమానత్వం వంటి అంశాలపై గతంలోనూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సునీత, చిన్మయి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.






# దసరాకు 'జైలర్ 2'..

సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' చిత్రంపై సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. 'జైలర్' ఘన విజయానంతరం దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌తో మరోసారి రజినీకాంత్ జతకట్టడంతో ఈ సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా, రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన తొలి, రెండో పోస్టర్లు ఇప్పటికే అభిమానులను ఆకట్టుకున్నాయి. మరోవైపు 'జైలర్ 2' విడుదల తేదీపై కూడా సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న దసరా సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు యోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రానికి కూడా సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరాలు సమకూరుస్తున్నారు. తొలి భాగానికి ఆయన అందించిన నేపథ్య సంగీతం విశేష ఆదరణ పొందిన నేపథ్యంలో సీక్వెల్‌లోనూ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదటి భాగంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా పలువురు ప్రముఖ నటులు అతిథి పాత్రల్లో కనిపించే అవకాశముందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ సీక్వెల్ మరోసారి ప్రేక్షకులను అలరిస్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అక్టోబర్ 16 విడుదల వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com